PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 238 | విజయవాడ, శనివారం 1 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 1 April 2023 | Rs

అధిక విమాన ఛార్జీలను నియంత్రించాలి

- ప్రధాని మోడీకి కేరళ సిఎం పినరయి విజయన్ లేఖ

లోపలి పేజీలో..



ఐపిఎల్ సీజన్-16 ప్రారంభం

- అలరించిన టాలీవుడ్ స్టార్స్
- నాటు.. నాటు.. పాటకు స్టెప్పులేసిన రష్మిక

లోపలి పేజీలో..

మరో పెగాసస్ కోసం...

కొత్త స్పైవేర్ వేటలో మోడీ సర్కారు



న్యూఢిల్లీ : పెగాసస్ స్పైవేర్ కొనుగోలుపై రేగిన దుమారం సద్దుమణగక ముందే మోడీ ప్రభుత్వం మరో కొత్త స్పైవేర్ కోసం వేట మొదలెట్టింది. పెగాసస్‌ను విక్రయించిన ఇజ్రాయిల్ ఎన్‌ఎస్‌ఒ గ్రూపు గురించి అందరికీ తెలిసిపోవడంతో, ఈసారి బయటి ప్రపంచానికి అంతగా తెలియని సంస్థల నుండి కొత్త స్పైవేర్ కొనుగోలుకు భారత ప్రభుత్వం జోరుగా పావులు కదుపుతున్నట్టు ఓ ప్రముఖ ఆంగ్ల పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ వెల్లడించింది. ఇందుకోసం రాబోయే కాలంలో 120 మిలియన్ల డాలర్లు (రూ.986 కోట్లు) మొత్తాన్ని ఖర్చు చేయాలని మోడీ ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఆ పత్రిక ప్రత్యేక కథనంలో పేర్కొంది.

ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియలో దాదాపు డజను వరకు సంస్థలు పాల్గొంటాయని భావిస్తున్నారు. ఇవన్నీ పెగాసస్ విక్రయ సంస్థ ఎన్‌ఎస్‌ఎ గ్రూపునకు ప్రత్యర్థి కంపెనీలే అయి వుంటాయని భావిస్తున్నారు. పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగించారా లేదా అని ఫోరెన్సిక్ పరీక్షల ద్వారా తెలుసుకునే సామర్థ్యం మానవ హక్కుల గ్రూపులకు వుండడం, పైగా ఎవరు లక్ష్యంగా మారారో వారికి యాపిల్, వాట్సాప్‌ల నుండి హెచ్చరికలు వీటన్నిటితో ప్రభుత్వ అధికారులు పిఆర్ సమస్య గురించి ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. దీంతో పెగాసస్‌కు బదులు వేరే కొత్త సంస్థ నుంచి స్పైవేర్ కొనాలని మోడీ ప్రభుత్వం భావిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయని ఆ వార్తా కథనం పేర్కొంది. రాబోయే కొన్నేళ్లలో కోటి 60 లక్షల డాలర్ల నుండి 12 కోట్ల డాలర్ల వరకు కాంట్రాక్టులు కుదిరే అవకాశం వుందని ఆ వర్గాలు తెలిపాయి. భారత రక్షణ, ఇంటెలిజెన్స్ అధికారులు పరిశీలిస్తున్న స్పైవేర్ సంస్థల్లో చాలావరకు ఇజ్రాయిల్ మిలటరీ ప్రత్యక్ష లేదా పరోక్ష ప్రమేయం వుందని ఫైనాన్షియల్ టైమ్స్ కథనం తెలిపింది.

అలా పేర్కొన్న కంపెనీల్లో గ్రీస్ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఇంటెలెక్సా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇజ్రాయిల్ మిలటరీ ప్రముఖుల జోక్యంతో ప్రిడేటర్ స్పైవేర్‌ను ఈ సంస్థ సృష్టించింది. ఈజిప్ట్, సౌదీ అరేబియా, మడగాస్కర్, ఒమన్ వంటి దేశాలతో సహా మానవ హక్కుల సూచీలో అట్టడుగున గల దేశాల్లో ఇప్పటికే దీన్ని ఉపయోగించిన చరిత్ర వుంది. భారత ప్రభుత్వం ఆశ్రయించిన కంపెనీల జాబితాలో క్వాడ్రెమ్ అనే మరో కంపెనీ కూడా వుంది. జర్నలిస్టు జమాల్ ఖషోగీ హత్య తర్వాత సౌదీ అరేబియాకు స్పైవేర్‌ను విక్రయించిన సంస్థ ఇది. కాగ్నైట్ అనే మరో సంస్థ కూడా మోడీ ప్రభుత్వ పరిశీలనలో వుంది. ఆయా కంపెనీలతో రాజ్‌నాథ్ నేతృత్వంలోని రక్షణ మంత్రిత్వ శాఖ జరుపుతున్న చర్చలు అడ్వాన్స్ దశలో వున్నాయి. అయితే లాంఛనప్రాయమైన 'ప్రతిపాదనకు అభ్యర్థనలు' పంపడానికి ఇంకా చాలా వారాలు పడుతుంది. వీటిలో ఏ కంపెనీ కూడా ఈ కథనంపై స్పందించడానికి ఇష్టపడలేదు. రక్షణ శాఖ దీనిపై మౌనం వహించింది.

క్రమబద్ధీకరణలో లేని స్పైవేర్ పరిశ్రమపై ఆంక్షలు విధించడానికి అమెరికా నేతృత్వంలో తాజా ప్రయత్నాలు జరిగాయి. నిఘా కోసం నిరంకుశ ప్రభుత్వాలు వాడే వాణిజ్యపరమైన స్పైవేర్‌ను ప్రభుత్వం ఉపయోగించడాన్ని నిషేధిస్తూ మార్చి 27న అమెరికా ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకొచ్చింది.

అమెరికా ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన 'ప్రజాస్వామ్య సదస్సు'లో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ, ఆస్ట్రేలియా, కెనడా, కోస్టారికా, డెన్మార్క్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, నార్వే, స్వీడన్, స్విట్జర్లాండ్, బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలన్నీ కలిసి స్పైవేర్ వినియోగానికి చట్టబద్ధమైన యంత్రాంగాలను రూపొందించి, అమలు చేయడానికి ఏక తాటిపైకి వచ్చాయని చెప్పారు. ఇటువంటి సాధనాల దుర్వినియోగం చాలా ఎక్కువగా వుందని, జాతీయ భద్రతకు ముప్పు పెరిగిందని వైట్‌హౌస్ గురువారం విడుదలజేసిన ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొంది. అయితే చాలా ప్రభుత్వాలు తమ సొంత ఇంటెలిజెన్స్ వర్గాలు రూపొందించిన నిఘా సాధనాలనే ప్రతిపక్ష నాయకులపైన, ఉన్నతాధికారుల పైన, జర్నలిస్టులపైన ఉపయోగిస్తుంటాయని ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది.

దేశాన్ని, వనరులను దోచుకుంటున్న మోదానీ అవినీతి, అక్రమాలపై

14 నుండి ప్రచార భేరి



సిపిఎం, సిపిఐ పిలుపు

రాష్ట్ర ప్రయోజనాలు కాలరాస్తున్న కేంద్రం

ప్రశ్నించని వైసిపి, టిడిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశాన్ని, వనరులను దోచుకుంటున్న మోడీ, అమిత్‌షా, అదానీ త్రయం మోదానీ దోపిడీపైనా, కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 14న అంబేద్కర్ జయంతి రోజు నుండి రాజకీయ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నామని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణ ప్రకటించారు. శుక్రవారం బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు జెల్లి విల్సన్‌లతో కలిసి వారు మాట్లాడారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మోదానీ త్రయం చేస్తున్న దోపిడీ, దుర్మార్గాలు, ప్రజాస్వామ్యాన్ని ఆపహాస్యం చేయడం, ప్రజల ఆస్తులు, సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టడంపై ప్రజలకు వివరించేందుకు ఏప్రిల్ 14వ తేదీ నుండి నెలాఖరు వరకూ సిపిఎం, సిపిఐ ఉమ్మడిగా రాజకీయ ప్రచారభేరి నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా పాదయాత్రలు, జీపుయాత్రలు, సభలు నిర్వహించడంతోపాటు వార్డుల్లో, గ్రామాల్లో ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకోవడంతోపాటు కేంద్రం మోపుతున్న భారాలను వివరిస్తామని తెలిపారు. ప్రస్తుతం పార్లమెంటులో ప్రజాస్వామ్య గొంతునొక్కి, భావప్రకటనా స్వేచ్ఛను అణచి వేస్తున్నారని తెలిపారు. ప్రధాన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీకి చిన్న కేసులో రెండు సంవత్సరాలశిక్ష పడితే దాన్ని అడ్డుపెట్టుకుని అతని సభ్యత్వాన్ని రద్దుచేసి ప్రతిపక్షాలపై బెదిరింపు చర్యలకు దిగారని విమర్శించారు. మోదానీ అక్రమాలపై పార్లమెంటులో చర్చ జరుగుతోందని, అయినా లక్షల కోట్ల కుంభకోణంపై ప్రధాని మోడీ నోరెత్తడం లేదని తెలిపారు. అన్ని ప్రతిపక్షపార్టీలు అదానీ అవినీతిపై చర్చకు పట్టుబడుతున్నా ప్రధాని ఇప్పటి వరకూ నోరెత్తకపోవం అంటే దేశానికి ఏమి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. అవినీతిలో భాగం లేదనిగానీ, తమకు సంబంధం లేదనిగానీ చెప్పలేకపోతున్నారని


మిగతా 5లో

టిడిపి ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలి సభ్యులుగా టిడిపి నుంచి గెలిచిన అభ్యర్థులు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల మూడు పట్టభద్ర నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. తూర్పు రాయలసీమ నుంచి కంచర్ల శ్రీకాంత్, పశ్చిమ రాయలసీమ నుంచి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, ఉత్తరాంధ్ర నుంచి వేపాడ చిరంజీవి, శాసనసభ్యుల కోటా నుంచి పంచుమర్తి అనురాధ టిడిపి నుంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నలుగురూ అసెంబ్లీలోని శాసనమండలి ఛైర్మన్ కార్యాలయంలో ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేశారు. ఛైర్మన్ కె మోషేను రాజు వీరితో ప్రమాణం చేయించారు. అనంతరం శాసన పరిషత్తు నియమ, నిబంధనలు తెలిపే ధ్రువీకరణ పత్రాలు, బుక్‌లెట్స్‌ను ఛైర్మన్ వీరికి అందించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఇన్‌ఛార్జి కార్యదర్శి సత్యనారాయణ, టిడిపి ఎమ్మెల్సీలు మంతెన సత్యనారాయణ రాజు, బిఎన్ రాజనర్సింహులు తదితరులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం టిడిపి అధినేత చంద్రబాబును ఎమ్మెల్సీలు ఉండవల్లిలో కలిశారు.





ప్రమాణం చేస్తున్న శ్రీకాంత్, చిరంజీవిరావు



రాజధాని అమరావతిని కాపాడుకోవడానికి

పోరాటమే మార్గం

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి ఉద్యమించడం తప్ప వేరే మార్గం లేదని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాజధానిని తరలిస్తే పతనం తప్పదని హెచ్చరించారు. అమరావతి ఉద్యమం శుక్రవారంతో 1200వ రోజుకు చేరిన సందర్భంగా గుంటూరు జిల్లా మందడం రైతు దీక్షా శిబిరంలో 'దగా పడ్డ రైతులు-దోపిడీకి గురవుతున్న ఆంధ్ర పౌరులు' పేరుతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, మహిళలు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారని, పరదాల చాటున దాక్కుని ప్రయాణాలు సాగిస్తున్నారని విమర్శించారు. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా వైసిపి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ మాట్లాడుతూ తాను ఎమ్మెల్సీగా గెలిచినా ఆనందంగా లేదని, రైతులు, మహిళలు ఇబ్బందులు చూస్తే బాధ కలుగుతోందని అన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అమరావతి రైతులకు మద్దతు తెలిపిన దగ్గర్నుంచి తనకు కష్టాలు మొదలయ్యాయని, త్వరలో రాజకీయ సునామీ రాబోతోందని, అమరావతి రాజధానికి మద్దతుగా ఉన్నవాళ్లే విజయం సాధిస్తారని అన్నారు. రాజధాని వ్యతిరేకులు అమరావతి రథ చక్రాల కింద నలిగిపోతారని హెచ్చరించారు. తాను వైసిపి నుంచి సస్పెండ్ అవడంతో స్వేచ్ఛగా తన అభిప్రాయాలను చెబుతున్నానన్నారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అమరావతి రాజధానికి నిధులు ఇచ్చే ఫైల్‌పై తొలి సంతకం చేస్తానని రాహుల్‌గాంధీ ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. వైసిపి హయంలో అమరావతి నిర్వీర్యం అయిందని, రైతుల ఆశలపై నీళ్లు చల్లారని అన్నారు. టిడిపి నాయకులు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజధాని కోసం పోరాడుతున్న రైతులకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఐదు కోట్ల ప్రజల రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతుల పట్ల వైసిపి ప్రభుత్వం దాష్టీకం ప్రదర్శిస్తోందన్నారు. బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మాట్లాడుతూ అమరావతి ఉద్యమ రైతులు ఎంతోమంది రైతులు చనిపోతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చోద్యం చూస్తూ తాడేపల్లిలో పబ్జీ ఆడుతున్నారని విమర్శించారు. జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, జై భీమ్

మిగతా 5లో



మందడం రైతు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

మే 20 నాటికి సర్వే పూర్తి

జగనన్న భూహక్కు అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



జగనన్న భూహక్కు పథకంలో మే 20 నాటికి అన్ని రకాల సర్వే ప్రక్రియలూ పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో సర్వే కోసం పరికరాలు ఉండాలని తెలిపారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంపై తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, గనులశాఖ అధికారులతో సిఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. దేశంలో ఇంత పెద్దఎత్తున ఎవరూ భూ సర్వే చేపట్టలేదని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా పత్రాలు అందిస్తున్నామని, ఇది ఇప్పటి వారికే కాకుండా భవిష్యత్తు తరాల వారికీ ఉపయోగమని పేర్కొన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు సర్వే ప్రక్రియ పూర్తిచేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన రోవర్లకు ఆర్డర్ చేయాలని, దీనివల్ల అనుకున్న సమయానికంటే ముందే సర్వే ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. ప్రతి గ్రామ సచివాలయంలో సర్వే కోసం పరికరాలు ఉండాలని, అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాలపై ఆలోచన చేయాలని సూచించారు. సర్వే పూర్తయిన తరువాత సరిహద్దు వద్ద వేసేందుకు 31 లక్షల సర్వే రాళ్లను సిద్ధం చేశామని, రోజుకు 50 వేలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. నిర్దేశించుకున్న సమయం ప్రకారం మున్సిపల్ ప్రాంతాల్లో చేయాల్సిన సర్వే కోసం సన్నాహాలు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ మూడోవారం నాటికి 300 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తవుతుందని పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు.

నేటి నుంచి మండనున్న మందుల ధరలు

- 384 ఔషధాల ధరలు పైపైకి

లోపలి పేజీలో..

మంత్రి 'సీదిరి' దిగ్బంధనం

- అచ్చెన్న మృతిపై హైకోర్టు జడ్జితో విచారణకు దళిత సంఘాల డిమాండ్



ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా అజయ్ బంగా!

వాషింగ్టన్ : ప్రపంచబ్యాంకు అధ్యక్షుడిగా ఇండో-అమెరికన్ వ్యాపార వేత్త అజయ్ బంగా ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఈ పదవికి నామినేషన్ గడువు బుధవారంతో ముగిసిందని, ఒక్క నామినేషన్ మాత్రమే వచ్చిందని ప్రపంచ బ్యాంకు అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుత అధ్యక్షుడు డేవిడ్ మాల్పాస్ తన పదవీకాలం ముగియకముందే పదవి నుంచి వైదొలగుతుండటంతో కొత్త అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైంది. 63 ఏళ్ల బంగాను యుఎస్‌ఎ అధ్యక్షుడు జోబైడెన్ నామినేట్ చేశారు. పూణెలోని ఖడ్కీ కంటోన్మెంట్‌లో జన్మించిన బంగా ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ, అహ్మదాబాద్ ఐఐటిలో ఎంబిఎ పూర్తి చేశారు. ప్రస్తుతం జనరల్ అట్లాంటిక్ కంపెనీ వైస్ ఛైర్మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2016లో పద్మశ్రీ, 2019లో ది ఎల్లిస్ ఐలాండ్ మెడల్ ఆఫ్ హానర్, బిజినెస్ కౌన్సిల్ ఫర్ ఇంటర్నేషనల్ గ్లోబల్ లీడర్ షిప్ అవార్డులను అందుకున్నారు.

'టెన్త్' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 3 నుంచి ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'పది' పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ పరీక్షల విభాగం ఏర్పాటు చేసింది. ఈ నెల 18 వరకు పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 6,64,152 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 3,11,329 మంది బాలురు, 2,97,741 మంది బాలికలు ఉన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులందరూ ఉదయం 8:45 గంటలకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడతారని, 9:30 దాటితే అనుమతించబోమని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి దేవానందరెడ్డి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,349 పరీక్ష కేంద్రాలను ఎస్‌ఎస్‌సి బోర్డు ఏర్పాటు చేసింది. ఒక్కో గదిలో 24 మంది విద్యార్థులు చొప్పున కేటాయించింది. సమస్యాత్మకంగా ఉన్న 104 పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలను బోర్డు ఏర్పాటు చేసింది.

ఒన్‌స్టాప్ వేతన వేదన

- 11 నెలలుగా ఉద్యోగులకు అందని వైనం
- పలు జిల్లాల్లో ఏళ్ల తరబడి పెండింగ్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి



కడపలోని ఒన్‌స్టాప్ సెంటర్

కేంద్ర ప్రభుత్వ పథకమైన ఒన్‌స్టాప్ సెంటర్ల ఉద్యోగులకు వేతన వేదన తప్పడం లేదు. 2022 మే నెల నుంచి వేతనాలు బకాయిలు ఉన్నారు. దీంతో, వీరు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పులతో కాలం వెళ్లదీస్తున్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో ఒక్కో ఒన్‌స్టాప్ సెంటర్ ఉంది. ఒక్కో సెంటర్‌లో 12 మంది నుంచి 16 మంది వరకు ఉద్యోగులు ఉన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో వీరిని నియమించారు. కేస్ వర్కర్, లాయర్, కౌన్సిలర్, పారా మెడికల్ ఉద్యోగి, ఐటి స్టాఫ్, సెక్యూరిటీ మల్టీ పర్పస్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వంటి వివిధ కేటగిరీల్లో వీరు విధులు నిర్వహిస్తున్నారు. వీరి స్థాయిలను బట్టి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు గౌరవ వేతనాన్ని నిర్ణయించారు. ఒక్కో సెంటర్‌కు నెలకు సగటున రెండు లక్షల రూపాయల వరకూ చెల్లించాల్సి ఉంది. ఉద్యోగులకు 11 నెలలుగా సుమారు మూడు కోట్ల రూపాయలు వేతన బకాయిలు ఉన్నాయి. నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో ఏళ్ల తరబడి వేతన బకాయిలు పేరుకుపోయాయి. ఈ రెండు జిల్లాల్లో అక్కడి కాంట్రాక్టు ఏజెన్సీల ద్వారా జరిగిన చెల్లింపుల్లో దొర్లిన అవకతవకలే ఇందుకు కారణమని సమాచారం. 2012లో ఢిల్లీలో దిశా అత్యాచార ఘటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2015లో ఒన్‌స్టాప్ సెంటర్లను దేశ వ్యాప్తంగా ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అప్పటి కేంద్ర మహిళా సంక్షేమ శాఖ మంత్రి మేనకాగాంధీ కొన్ని రాష్ట్రాల్లో పైలెట్ ప్రాజెక్టులను ప్రారంభించారు. 2017లో రాష్ట్రంలోని కృష్ణా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటైంది. ఇవి సాధించిన ఫలితాల ఆధారంగా దేశవ్యాప్తంగా ఒన్‌స్టాప్ సెంటర్లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రధానంగా గృహ హింస, వరకట్న వేధింపులు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, బాల్యవివాహాలు, మహిళల అదృశ్యం, వరకట్న మరణాలు వంటి కేసుల్లో బాధితులకు ఉచిత న్యాయసేవలు, తాత్కాలిక వసతి సదుపాయాల కల్పన వంటి పలు రకాల సేవలు అందించాలనేది ఈ సెంటర్ల లక్ష్యం. భార్యాభర్తల సమస్యలకు సంబంధించిన కౌన్సిలింగ్ ఇప్పించడం మొదలుకుని ఎఫ్‌ఐఆర్ నమోదు చేయించడం, బాధిత మహిళలకు ఉచిత న్యాయ సేవలందించడం వంటి సహాయ, సహకారాలు అందుతున్నాయి. గుంటూరు జిల్లా కేంద్రంగా 181 నెంబర్‌తో హెల్ప్‌లైన్ సదుపాయం ఉంది. మహిళల సమస్యల పరిష్కారంలో ఈ కేంద్రాలకు రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ సహాయసహకారాలు అందిస్తోంది. బకాయిలు వేతనాలు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఒన్‌స్టాప్ ఉద్యోగులు కోరుతున్నారు.

బెంగళూరులో దారుణం

- యువతిపై దుండగుల అఘాయిత్యం
- పార్కులోంచి ఈడ్చుకెళ్లి కదులుతున్న కారులో లైంగికదాడి



బెంగళూరు : బిజెపి పాలనలోని కర్ణాటకలో మహిళలకు రక్షణ కరువైంది. రాష్ట్ర రాజధాని బెంగళూరులోనే దారుణ ఘటన చోటు చేసుకున్నది. కొందరు దుండగులు ఓ మహిళను పార్కులో నుంచి బలవంతంగా ఈడ్చుకెళ్లి కదులుతున్న కారులో లైంగికదాడికి పాల్పడ్డారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు సిటీలోని కోరమంగళ ఏరియాలోగల నేషనల్ గేమ్స్ విలేజ్ పార్కులో గత నెల (మార్చి) 25న బాధితురాలు, ఆమె స్నేహితుడు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఒక వ్యక్తి వారి దగ్గరకు వచ్చి, రాత్రిపూట పార్కులో ఏం చేస్తున్నారంటూ బెదిరించాడు. దాంతో భయపడిన ఆమె స్నేహితుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇదే అదనుగా భావించిన ఆ వ్యక్తి తన ముగ్గురు స్నేహితులకు ఫోన్ చేసి అక్కడికి రప్పించాడు. వాళ్లు ఆమెను బలవంతంగా పార్కులోంచి లాక్కొచ్చి ముందుగానే సిద్ధంగా ఉంచిన కారులోకి తోశారు. అనంతరం ఆ కారును వీధుల్లో తిప్పుతూ కదులుతున్న కారులోనే సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మార్చి 26న తెల్లవారుజామున బాధితురాలిని తన ఇంటి సమీపంలో విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఈ ఘటన గురించి ఎవరికైనా చెప్పినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని దుండగులు ఆమెను బెదిరించారు. ఈ ఘటనతో ఆమె తీవ్ర అనారోగ్యానికి గురవడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే విషయం కుటుంబసభ్యులకు చెప్పింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మహిళా సంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మంత్రి 'సీదిరి' దిగ్బంధనం

- డాక్టర్ అచ్చెన్న మృతిపై హైకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరపాలి
- పశుసంవర్ధకశాఖ డైరెక్టరును తక్షణమే తప్పించాలి
- ఉద్యోగ, దళిత సంఘాల డిమాండ్



సీదిరిని నిలదీస్తున్న కెవిపిఎస్, దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప జిల్లాలో హత్యకు గురైన పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న హత్యకేసుపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, తక్షణమే పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్‌ను విధుల్లోంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు, కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్, జై భీమ్ సేన నాయకులు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును దిగ్బంధనం చేశారు. శుక్రవారం విజయవాడలోని బందరు రోడ్డులోని పశు సంవర్ధకశాఖ డైరెక్టరు కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధకశాఖ ఎస్‌సి, ఎస్‌టి గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన అచ్చెన్న సంతాప జరిగింది. ఈ సంతాప సభకు మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, జైభీమ్ సేన నాయకులు సిద్దార్థ తదితరులు హాజరయ్యారు. డాక్టర్ అచ్చెన్న హత్యకేసులో ఇప్పటికే అరెస్టులు చేశామని, శాఖాపరమైన విచారణకు ఆదేశించామని మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పగానే రాష్ట్రంలో దళిత అధికారులకు రక్షణ లేకుండా పోయిందని, గతంలో డాక్టర్ సుధాకర్ పట్ల కూడా ప్రభుత్వం ఇదే విధంగా వ్యవహరించిందని అండ్ర మాల్యాద్రి అనగానే మంత్రి జోక్యం చేసుకుని 'మీరు రాజకీయాలు చేస్తున్నారు' అని అన్నారు. వెంటనే ఉద్యోగులంతా మూకుమ్మడిగా మంత్రి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రిని మాట్లాడనివ్వకుండా అడ్డుకున్నారు. కడపలో ఏడాదిగా సమస్య వున్నా ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోలేదని నిలదీశారు. డాక్టర్ అచ్చెన్న విధి నిర్వహణలో నిజాయతీగా ఉండటం తప్పా? అని ప్రశ్నించారు. ఆఫీస్‌లో సక్రమంగా పనిచేయడం లేదని ఆధారాలతో డైరెక్టర్ కార్యాలయానికి నివేదిక పంపితే ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆశీస్సులతో విద్యార్హత లేకున్నా.. సుభాష్ చంద్రబోస్ పోస్టింగ్ వేయించుకుని అచ్చెన్నను ఇబ్బంది పెట్టారని అన్నారు. సకాలంలో ప్రభుత్వం స్పందించి వుంటే నిజాయతీగా పనిచేసే అచ్చెన్న బతికి వుండేవారని అన్నారు. అచ్చెన్న కిడ్నాప్ అయ్యారని ఆయన కుటుంబ సభ్యులు కేసు పెడితే అక్కడి సిఐ, ఎస్‌పి సరిగ్గా స్పందించలేదన్నారు. కిడ్నాప్‌కు గురయ్యారని కేసు పెడితే.. కనిపించకుండా పోయిన అచ్చెన్నను ప్రభుత్వం ఎలా సస్పెండ్ చేస్తుందని నిలదీశారు. కనిపించకుండా పోయాక ఈ కేసులో అరెస్టయిన సుభాష్ చంద్రబోస్ విజయవాడకు వచ్చి డైరెక్టర్ ద్వారా సస్పెన్షన్ ఉత్తర్వులు ఇప్పించారన్నారు. మృతదేహం దొరికాక అనుమానితుల పేర్లతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే డైరెక్టర్ పేరు లేకుండా ఇస్తేనే తీసుకుంటానని సిఐ ఒత్తిడి చేసి డైరెక్టర్ పేరును తీసివేయించారని అన్నారు. ఈ కేసులో డైరెక్టర్ పాత్ర ఇంత స్పష్టంగా వున్నా ఎందుకు ఆయనపై చర్యలు తీసుకోలేదని మంత్రిని నిలదీశారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి చెప్పినప్పటికీ ఉద్యోగులు ఆయనను చుట్టుముట్టి అచ్చెన్నకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. అచ్చెన్న హత్య వార్త తెలిసిన వెంటనే కర్నూలులోని వారి కుటుంబ సభ్యులను కలిశానని తెలిపారు. ఆ తర్వాత కడపకు వెళ్లి డాక్టర్ పనిచేస్తున్న కార్యాలయంలో, సిఐ, ఎస్‌పితో కలిసి మాట్లాడానని, ఏ కోణంలో చూసినా ఇందులో పెద్ద కుట్రకోణం ఉందని పేర్కొన్నారు. తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్‌ను పదవి నుంచి తప్పించాలన్నారు.

హైకోర్టుకు పూనం మాలకొండయ్య

ప్రజాశక్తి-అమరావతి

సీనియర్ ఐఎఎస్ అధికారి, సిఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, వైద్య, విద్యాశాఖ గత డైరెక్టర్, వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ విసి కె బాబ్జీ, విజయవాడ ప్రభుత్వ డెంటల్ కాలేజీ గత ప్రిన్సిపల్ టి మురళీమోహన్ శుక్రవారం హైకోర్టు విచారణకు హాజరయ్యారు. ఓ ఉద్యోగికి జీతం చెల్లించాలన్న తమ ఆదేశాల్ని ఎందుకు అమలు చేయలేదని వారిని ధర్మాసనం ప్రశ్నించింది. జీతం చెల్లించకపోతే ఆ మహిళ ఎలా జీవనం సాగించాలని అడిగింది. హెచ్‌ఆర్‌ఎ, డిఎ మొదలైన వాటిని కూడా కలిపి చెల్లిస్తేనే జీతమంటారని చెప్పింది. ఈ వ్యవహారంపై అఫిడవిట్ దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. విచారణను ఏప్రిల్ 28కి వాయిదా వేస్తూ న్యాయమూర్తులు జస్టిస్ ఎం గంగారావు, జస్టిస్ డి వెంకటరమణతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల అమలుకు ఎందుకు జాప్యం చేశారని వారిపై అసహనం వ్యక్తం చేసింది. నిర్లక్ష్యపూరిత వైఖరిని కొనసాగించినందునే వ్యక్తిగత విచారణకు ఉత్తర్వులు ఇచ్చామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 28కి వాయిదా వేసింది.

3 నుంచి ఒంటిపూట బడులు

- ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పాఠశాలలకు ఈ నెల 3వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభిస్తామని ఉపాధ్యాయ సంఘాలకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. మంత్రి బొత్సను యుటిఎఫ్, ఎస్‌టియు, ఎపిటిఎఫ్-1938, ఎపిటిఎఫ్-257 సంఘాల నాయకులు శుక్రవారం కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీసుకు పాల్పడ్డారని కొంతమంది ఉపాధ్యాయులను తహశీల్దారు కార్యాలయాల్లో హాజరుకావాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని మంత్రిని నాయకులు కోరారు. దీనికి మంత్రి అంగీకరించారు. పదో తరగతి పరీక్షలు జరిగే 3,349 పాఠశాలను పరీక్ష సమయంలో పూర్తి సెలవు దినంగా ప్రకటిస్తామని మంత్రి చెప్పారు. ఆ ఐదు రోజులను తరువాత వచ్చే సెలవు దినాల్లో నిర్వహించాలని తెలిపారు. మున్సిపల్ డ్రాఫ్ట్‌పై సూచనలు చేయడానికి ఈ నెల 3 వరకు గడువు ఇచ్చామని చెప్పారు. ఈ నెల 30తో ఈ విద్యాసంవత్సరం ముగుస్తుందని తెలిపారు. పాఠశాలల పున:ప్రారంభ తేదీని తరువాత ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి దేవానందరెడ్డి, యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, ఎపిటిఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి, ఎస్‌టియు అధ్యక్షులు సాయి శ్రీనివాస్, ఎపిటిఎఫ్-257 అధ్యక్షులు సిహెచ్ మంజుల పాల్గొన్నారు.

మన్యం బంద్ విజయవంతం

- మూతపడిన వాణిజ్య, విద్యా సంస్థలు, హోటళ్లు, పర్యాటక ప్రాంతాలు
- బోయ, వాల్మీలను ఎస్‌టి జాబితాలో చేర్చితే ఊరుకునేది లేదని నేతల హెచ్చరిక



అరకులోయలో నిరసన చేపట్టిన గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, తదితరులు

ప్రజాశక్తి - యంత్రాంగం

బోయ, వాల్మీలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజనులు చేపట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది. ఈ బంద్‌కు పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలూ మద్దతు తెలిపాయి. బోయ, వాల్మీలను ఎస్‌టి జాబితాలో చేర్చితే ఊరుకునేది లేదని నాయకులు హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లో ఎపి గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసి, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌కు విశేష స్పందన లభించింది. ఆర్‌టిసి బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. హోటళ్లు, వర్తక వాణిజ్య సంస్థలు, పర్యాటక ప్రాంతాలు మూతపడ్డాయి. పాడేరులో రోడ్డుపై బైఠాయించి వంటావార్పుతో ఆందోళన చేపట్టారు. ఐటిడిఎ కార్యాలయానికి వెళ్లేందుకు తన నివాస గృహం నుంచి వస్తున్న ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ వాహనాన్ని ఆదివాసీ ఉద్యమ నేతలు అడ్డుకున్నారు. డుంబ్రిగుడలో పెట్రోల్ బంక్, యూనియన్ బ్యాంక్ సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలూ మూతపడ్డాయి. అనంతగిరి, చిల్లలగెడ్డ పంచాయతీ పరిధి వంకాయపాలెం వద్ద ఆందోళన చేపట్టారు. ముంచంగిపుట్టు, చింతపల్లి, జి.మాడుగులలో భారీ ర్యాలీలు జరిగాయి. రంపచోడవరం ఏజెన్సీలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకులు, దుకాణాలు, మూతపడ్డాయి. ఐటిడిఎ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావును పోలీసులు అరెస్టు చేసే ప్రయత్నం చేయగా తీవ్రంగా ప్రతిఘటించారు. రాజవొమ్మంగి వద్ద జాతీయ రహదారిపై ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రాస్తారోకో నిర్వహించారు. ఎటపాక మండలం నెల్లిపాక, లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారులపై బైఠాయించారు. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి, విఆర్.పురం మండల కేంద్రంలోని రేఖపల్లి జంక్షన్ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అడ్డతీగల, మారేడుమిల్లి, కొయ్యూరు, జికె.వీధి మండలం సీలేరు, ధారకొండ తదితర ప్రాంతాల్లో బంద్ విజయవంతమైంది.

శ్రీకాకుళం జిల్లా కొత్తూరులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ధర్నా చేపట్టారు. మెళియాపుట్టిలోని మెయిన్ జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంతో సహా అన్ని ఏజెన్సీ మండలాల్లో బంద్ సంపూర్ణంగా జరిగింది. పలుచోట్ల అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కూడా బంద్‌లో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. గుమ్మలక్ష్మీపురం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఎపి గిరిజన సంఘం నాయకులు కోలక అవినాష్ పాల్గొన్నారు. సాలూరులో స్థానిక బోసు బొమ్మ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కురపాం, కొమరాడ, పాచిపెంట, సీతంపేట, పాలకొండ తదితర ప్రాంతాల్లోనూ బంద్ విజయవంతమైంది. ఏలూరు జిల్లా పరిధిలోని గిరిజన మండలాల్లో బంద్ విజయవంతమైంది. కుక్కునూరులో పాత రామాలయం సెంటర్ నుండి భద్రాచలం ప్రధాన రహదారి వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బుట్టాయగూడెం మండల కేంద్రం నుంచి వేలేరుపాడు నుంచి మేడేపల్లి వరకూ మోటారు సైకిల్ ర్యాలీ చేశారు. పోలవరం, టి.నర్సాపురం మండలంలోని గిరిజనులు బంద్‌కు మద్దతుగా నిరసన తెలిపారు.

బిసిలను మభ్యపెడుతున్న సిఎం

- యువగళం పాదయాత్రలో నారా లోకేష్



ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి (సత్యసాయి జిల్లా)

మాటలతో బిసిలను సిఎం జగన్ మభ్యపెడుతున్నారని.. వైసిపి ప్రభుత్వంలో వారికి ఒరిగిందేమీ లేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన యాత్ర శుక్రవారం సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలోని కోన క్రాస్ నుంచి ప్రారంభమైంది. పాదయాత్రలో దేవరకొండ జలాశయ ముంపు రైతులతో సమావేశం నిర్వహించారు. బిసిలతో భేటీ అయ్యారు. యర్రంపల్లి వద్ద జాకీ పరిశ్రమ భూ బాధితులతో మాట్లాడారు. ఉప్పరవాండ్లపల్లి కొట్టాల వద్ద సత్యసాయి నీటి సరఫరా కార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం ప్యాదిండి గ్రామ సమీపంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. బిసిలకు అనేక పదవులిచ్చామని గొప్పలు చెబుతూ.. వారిని మాటలతో సిఎం మభ్యపెడుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే బిసిలకు సంక్షేమ పథకాలను పక్కాగా అమలుచేస్తామని తెలిపారు. సత్యసాయి నీటి సరఫరా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని, తాము అధికారంలోకి రాగానే అన్ని కేసులూ కొట్టివేయిస్తామని హామీ ఇచ్చారు. ఎండను సైతం లెక్క చేయకుండా తనతో పాటు పాదయాత్రలో పాల్గొన్న ప్రతి కార్యకర్తకూ రుణపడి ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి, మాజీ మంత్రి పరిటాల సునీత, యువ నాయకులు పరిటాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. యాత్ర ప్యాదిండి సమీపంలోని విడిది కేంద్రానికి చేరుకుంది. శనివారం ప్యాదిండి నుంచి యాత్ర కొనసాగనుంది.

బిజెపి నేత సత్యకుమార్ కారుపై దాడి

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ కారుపై శుక్రవారం దాడి జరిగింది. తుళ్లూరు మండలం మందడం రైతు దీక్షా శిబిరంలో రైతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశం నుండి తిరిగి వెళ్తున్న ఆయన కారుపై తాళ్లాయపాలెంలోని మూడు రాజధానుల మద్దతు శిబిరం వద్ద కొంతమంది దాడి చేశారు. రైతు శిబిరంలో వైసిపిపై, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సత్యకుమార్ కారు అద్దాలను పగలగొట్టారు. ఈ క్రమంలో ఇరుగ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు వారిని చెదరగొట్టారు. దీనిపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి రాయి విసిరాడు : మీడియాతో ఎఎస్‌పి

మూడు రాజధానుల శిబిరంపై బిజెపి నేతలు దాడి చేయలేదని గుంటూరు జిల్లా ఎఎస్‌పి పులిపాటి అనిల్ మీడియాకు తెలిపారు. తాను ఉదయం నుండి శిబిరం వద్ద ఉన్నానని, మందడం శిబిరంలో బిజెపి నేత ఆదినారాయణ రెడ్డి... సిఎం జగన్‌ను దుర్భాషలాడుతూ కొన్ని వ్యాఖ్యలు చేసినట్లు తెలుసుకున్న మూడు రాజధానుల మద్దతుదారులు తాళ్లాయపాలెం జంక్షన్ వద్ద బిజెపి నేతలను అడ్డుకున్నారని, ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి సత్యకుమార్ వాహనంపై రాయి విసిరి పారిపోయాడని, ఆయన కోసం గాలిస్తున్నామని తెలిపారు.

20 నుంచి సమ్మేటివ్ పరీక్షలు-2

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యార్థులకు ఈ నెల 20 నుంచి సమ్మేటివ్ పరీక్షలు-2 (తరగతి ఆధారిత మూల్యాంకనం-3 పరీక్షలు) ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ శుక్రవారం విడుదల చేశారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ నెల 20, 24, 25 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. 3, 4, 5 తరగతులకు పర్యావరణ శాస్త్రం పరీక్ష 26వ తేదీన ఉంటుంది. 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు 20, 24, 25, 26, 27, 28, 29 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయి. 7, 9వ తరగతి విద్యార్థులకు 20, 24, 25, 26, 27, 28, 29 తేదీల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లే 9వ తరగతికి కూడా 6 పేపర్ల విధానంలో నిర్వహించాలని కమిషనరు ఆదేశించారు.

ఆర్‌టిసి లైవ్‌ట్రాకింగ్ యాప్‌ను అప్‌డేట్ చేసుకోండి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి బస్సులకు సంబంధించి ఇప్పటిదాకా వున్న లైవ్‌ట్రాకింగ్ యాప్ కాలపరిమితి మార్చి 31తో ముగిసింది. ఆర్‌టిసి యాప్ వినియోగదారులందరూ అప్‌డేట్ చేసుకోవాలని ఆర్‌టిసి సాంకేతిక విభాగం కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆర్‌టిసి ఒక ప్రకటన విడుదల చేసింది. గూగుల్ ప్లేస్టోర్స్ నుంచి గానీ, ఐఒఎస్ స్టోర్స్ నుంచి గానీ ఆర్‌టిసి లైవ్ ట్రాకింగ్ యాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కోరింది. యాప్‌ను అప్‌డేట్ చేసుకోకపోతే ఏప్రిల్ ఒకటి నుంచి పాత ట్రాకింగ్ యాప్ పనిచేయదని తెలిపింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వేతనాలు పెంచాలి

- ఎస్ఎస్ఎ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా (ఎస్ఎస్ఎ) ప్రాజెక్టులోని వివిధ విభాగాల కాంట్రాక్టు ఉద్యోగులకు తక్షణమే వేతనాలు పెంచాలని ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఫిబ్రవరి, మార్చి నెలల పెండింగ్ జీతాలకు వెంటనే బడ్జెట్ విడుదల చేయాలని ఫెడరేషన్ అధ్యక్షులు ఎం బాలకాశీ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు పిఆర్‌సిని అమలు చేసి వేతనాలు పెంచిందని, తమకు మాత్రం వర్తింపజేయలేదని పేర్కొన్నారు. నేటికీ వేతనాలు పెంచలేదని తెలిపారు. కెజిబివి, సమగ్ర సొసైటీలోని కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ (ఎంటిఎస్) ఇస్తూ మూడు జిఒలు ఇచ్చినా అమలు కాలేదని పేర్కొన్నారు. కెజిబివి ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయకుండా 23 శాతం జీతాలు పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకుందని, ఇప్పటికీ దీనికి సంబంధించిన జిఒ రాలేదని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే ఎంటిఎస్ ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 3, 4 తేదీల్లో ఎంఇఒ కార్యాలయాల వద్ద, క్లస్టర్ కాంప్లెక్స్ వద్ద, హైస్కూల్స్, కెజిబివిలలో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రగతి పథంలో వైజాగ్ పోర్టు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వైజాగ్ పోర్టు ట్రస్ట్ ప్రగతి పథంలో దూసుకుపోతోందని విశాఖ పోర్టు ట్రస్టు చైర్మన్ కె రామ్మోహనరావు తెలిపారు. ఆయన అధికార బాధ్యతల చివరి రోజు నేపథ్యంలో శుక్రవారం విశాఖ పోర్టు కళావాణిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చైర్మన్‌గా 2019 నవంబర్‌లో తాను బాధ్యతలు తీసుకున్నపుడు పోర్టు కార్గో హ్యాండ్లింగ్ 65 మిలియన్ టన్నులని, ఈ మూడున్నరేళ్లలో 73.75 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేశామని తెలిపారు. రూ.1700 కోట్ల ఆదాయాన్ని ఆర్జించామన్నారు. గడిచిన 90 ఏళ్లలో ఇదే రికార్డు' అని తెలిపారు. దేశంలోని మేజర్ పోర్టుల్లో నాలుగో స్థానం, తూర్పుతీర పోర్టుల్లో రెండో ర్యాంకు సాధించిన ఘనత తమ పోర్టుకే దక్కిందన్నారు. అదానీ దక్కించుకున్న ఇక్యూ-1 బెర్తులో ఆయన వ్యాపారం చేయకుండా వదిలేయడంతో దీన్ని కూడా పోర్టు ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్‌లో మరో ప్రయివేట్ ఆపరేటర్‌కు ఇచ్చామని చెప్పారు. తద్వారా రూ.54 కోట్లు ఆదాయం అదనంగా వచ్చిందన్నారు. అదానీతో ఉన్న కోర్టు చిక్కులన్నిటినీ తొలగించుకుని బెర్తును కాపాడుకున్నామని వివరించారు. పిపిపి అంటే ప్రయివేటీకరణ కాదని, లీజుకు ఇవ్వడమని తెలిపారు.

అమరావతి ఉద్యమం కృత్రిమం

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అభివృద్ధిని వికేంద్రీకరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు పోతుంటే అమరావతి పేరుతో కృత్రిమ ఉద్యమాలు చేస్తూ ప్రభుత్వంపై చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతికి చంద్రబాబు చేసిందేమీలేదన్నారు. వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యమని, ఎన్నో అనుభవాలున్నా వికేంద్రీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతిలో రూ.వేల కోట్ల ల్యాండ్ స్కామ్ జరిగిందని విమర్శించారు. అమరావతి అభివృద్ధికి ఎలాంటి ఢోకా లేకుండా ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ మేరకు ముందుకు పోతున్నామని అన్నారు. కర్నూలులో న్యాయ రాజధాని కావాలని బిజెపి డిమాండ్ చేసి, ఇప్పుడు ఎందుకు యూటర్న్ తీసుకుందో వారే చెప్పాలన్నారు. చంద్రబాబు ఉచ్చులో ఇతర పార్టీలు చిక్కుకున్నట్లు అనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో గుంట నక్కలు, తోడేళ్లు ఏకమై దాడి చేస్తున్నాయని విమర్శించారు. ఎవరిపైనా దాడులు చేయాల్సిన అవసరం తమకు లేదని, ప్రజాస్వామ్యంలో విమర్శలు, ఆరోపణలు చేయొచ్చుగానీ దాడుల సంస్కృతి సరికాదనే అంశాన్ని బిజెపి నాయకులు గ్రహించాలన్నారు.

టిడిపి కౌన్సిలర్‌పై వైసిపి దాడి

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం రసాభాసగా సాగింది. చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం అధ్యక్షతన అజెండా అంశాలు చదువుతుండగా టిడిపి సభ్యుడు దేశు యుగంధర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయ పరిధిలో రూ.20 లక్షలను కేటాయించిన నేపథ్యంలో, సింగిల్ టెండర్ల ఆమోదంపై చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. 33వ వార్డు కౌన్సిలర్ మొఘల్ రహ్మత్ బేగ్ జోక్యం చేసుకుని మాట్లాడుతుండగా, దేశు యుగంధర్ వ్యతిరేకించాడు. దీంతో ఇరువురూ దూషణ పర్వానికి దిగారు. యుంగధర్‌పై మొఘల్ రహ్మత్ బేగ్ దాడి చేశాడు. బల్లపైకి ఎక్కి, దూకి, వెంటపడి మరీ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన అనంతరం వైసిపి సభ్యులంతా కౌన్సిల్ నుంచి వెళ్లిపోయారు. దాడిని నిరసిస్తూ చైర్మన్ పోడియం ముందు టిడిపి సభ్యులు నిరసనకు దిగారు. దీంతో చైర్మన్ కౌన్సిల్ నుంచి నిష్క్రమించారు. అనంతరం టిడిపి నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. అనంతరం దాడి ఘటనపై పోలీసులకు పిర్యాదు చేశారు. దేశు యుగంధర్‌పై దాడిని ఆర్యవైశ్య సంఘాలు తీవ్రంగా ఖండించాయి. నిరసనగా శనివారం పట్టణ బంద్‌కు పిలుపునిచ్చాయి.

జీతాలు పెంచాలని.. అదానీ పోర్టు వద్ద కార్మికుల ఆందోళన

- డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ కార్మికుడు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

తమకు తక్షణమే జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అదానీ గంగవరం పోర్టు వద్ద కార్మికులు శుక్రవారం ధర్నాకు దిగారు. గడిచిన 15 ఏళ్లుగా తమకు ఒక్క రూపాయి కూడా జీతం పెంచలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన విషయం తెలిసి భారీ ఎత్తున పోలీసులు వచ్చినప్పటికీ తమ జీతాల సంగతి తేల్చే వరకూ కదిలేది లేదని కార్మికులందరూ పోర్టు గేటు వద్దే బైఠాయించారు. ఓ వైపు అదానీకి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు, మరోవైపు భారీగా మోహరించిన పోలీసులతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కె.నూకరాజు అనే కార్మికుడు ఒంటిపై డీజిల్ వేసుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. పోలీసులు స్పందించి ఆయనను పక్కకు తీసుకెళ్లారు. 15 సంవత్సరాలుగా 551 మంది కార్మికులు ఈ పోర్టులో పని చేస్తున్నారు. నాటి నుంచీ వీరికి రూ.15 వేలు మాత్రమే జీతంగా చెల్లిస్తున్నారు. గతంలో ఒకసారి ధర్నా చేస్తే జీతాలు చెల్లిస్తామని పోర్టు యాజమాన్యం మాట ఇచ్చి, తప్పింది. జీతాలు పెంచకపోవడంతో కార్మికులు మెరుపు ధర్నాకు దిగారు. తమకు రూ.36 వేల వేతనం చెల్లించాలని, లేనిపక్షంలో వలంటరీ రిటైర్మెంట్ స్కీమ్ కింద రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉదయం యాజమాన్యం చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో కార్మికులు ఆందోళనను కొనసాగించారు. ఈనెల 5వ తేదీలోపు మీ సమస్యలు పరిష్కరిస్తామని పోర్టు అధికారులు హామీ ఇవ్వడంతో కార్మికులు తాత్కాలికంగా ధర్నాను వాయిదా వేశారు. కార్మికుల పోరాటానికి గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్, వైసిపి, టిడిపి, జనసేన, ఎఐటియుసి మద్దతు తెలిపాయి.

మూతపడిన 'ది చెన్నై సిల్క్'

- ఆందోళనకు దిగిన కార్మికులు
- సిఐటియు సంఘీభావం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

'ది చెన్నై సిల్క్' దక్షిణ భారత దేశంలోనే పేరుమోసిన వస్త్ర దుకాణం. అంచనా మేరకు వ్యాపారం జరగకపోవడంతో చిత్తూరు బ్రాంచ్‌ను ఉన్నఫలంగా గురువారం రాత్రికి రాత్రే మూసివేశారు. దీంతో అందులో పని చేస్తున్న 65 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. తమ భవిష్యత్ ఏంటంటూ చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిపై కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఉన్నఫళంగా తొలగించడంతో శుక్రవారం చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలోని దుకాణం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి కార్మికులతో చర్చలు జరిపారు. యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు కార్మికులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అర్ధరాత్రి నుంచి ఆందోళన చేస్తున్న కార్మికుల శిబిరం వద్దకు సిఐటియు వెళ్లి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చైతన్య, సురేంద్ర డిమాండ్ చేశారు.

జూన్‌లో దళిత రక్షణ యాత్రలు

- కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై జూన్‌లో దళిత రక్షణ యాత్రలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. వేలాది మంది దళితులను సమీకరించి చలో విజయవాడ నిర్వహించాలని తీర్మానించింది. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు బుధ, గురువారాల్లో జరిగాయి. ఆ సంఘం నాయకులు ఎండి ఆనంద్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్ణయాలను ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఏప్రిల్ 5, 11, 14 తేదీల్లో బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావుపూలే, బిఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను నిర్వహించి దళితుల సమస్యలు ప్రస్తావించాలని తెలిపారు.

మీడియా అక్రిడిటేషన్‌ల జిఓ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫొటో, వీడియో, డెస్క్ జర్నలిస్టులతోపాటు సీనియర్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌లను మంజూరు చేసే అక్రిడిటేషన్ కమిటీలకు సంబంధించి విధివిధానాలతో కూడిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. రాష్ట్ర సమాచారశాఖ కమిషనరు టి విజయకుమార్ ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వుండే ఈ అక్రిడిటేషన్ కమిటీల్లో గతంలో జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం వుండేది. ఇప్పుడు సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా ప్రభుత్వమే జర్నలిస్టులను కమిటీల్లోకి నేరుగా తీసుకునేలా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రింట్ మీడియాలో పెద్ద పత్రికలను సర్క్యులేషన్ ఆధారంగా కేటగిరిలుగా విభజించింది. చిన్న పత్రికలకు, పీరియాడికల్స్‌కు, ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి కూడా ప్రత్యేకంగా విధానాన్ని తీసుకొచ్చింది.

● ఆర్టిసిలో కారుణ్య నియామకాలకు యాజమాన్యం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల ఆర్టిసిలోని ఇయు, ఎస్‌డబ్ల్యుఎఫ్ తదితర ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఆర్టిసిలో 2016 జనవరి ఒకటి నుంచి 2019 డిసెంబరు 31 వరకు పెండింగ్‌లో వున్న కారుణ్య నియామకాలకు సంబంధించి 1,168 పోస్టులను భర్తీకి ఉత్తర్వులు జారీ చేసింది.

లైంగిక వేధింపులు అరికట్టేందుకు సమైక్య ప్రతిఘటన

మోటూరు ఉదయం వర్థంతిలో వక్తలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లైంగిక వేధింపులను అరికట్టేందుకు అందరూ ముందుకు రావాలని, సమైక్యంగా ప్రతిఘటించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి పిలుపునిచ్చారు. మహిళా ఉద్యమ నాయకులు మోటూరు ఉదయం 11వ వర్థంతి సభ శుక్రవారం ఉదయం కొలనుకొండలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా డి రమాదేవి మాట్లాడుతూ.. ఇటీవల త్రిపుర అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యే పోర్న్ వీడియోలు చూస్తూ పట్టుబడ్డారని, అంతకుముందు కర్ణాటకలోనూ అధికారపక్ష ఎమ్మెల్యే ఇదే విధంగా వ్యవహరించారని తెలిపారు. రెజ్లింగ్ అసోసియేషన్ ఛైర్మన్‌గా ఉన్న బిజెపి నాయకుడు, హర్యానాలో బిజెపి క్రీడల మంత్రి క్రీడాకారులను ఇలాగే వేధించారని తెలిపారు.

వారిపై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ నగరంలో ఆందోళనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పార్లమెంటులో సతీసహగమనాన్ని సమర్థిస్తూ బిజెపి ఎంపి వ్యాఖ్యానించారని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహిళలను నీచంగానూ, హీనంగానూ చూసే సంస్కృతిని విస్తరింపజేస్తోందని వివరించారు. వారి మంత్రులను, ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి ఫిర్యాదు చేసిన మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరిస్తోందని తెలిపారు.

మొటూరు ఉదయం నేతృత్వంలో బలపడిన మహిళా సంఘం బలమైన ఉద్యమాన్ని నిర్మించి అనేక చట్టాలు తీసుకురాగలిగిందని వివరించారు. సాధించిన చట్టాలు కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నీరు కారుస్తోందని పేర్కొన్నారు. నిత్య చైతన్యశీలి అయిన ఉదయం బాటలో పోరాడాలని ఆమె కోరారు. ఐద్వా గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు గిరిజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు అమల, సంధ్య, ప్రసన్న, కావ్య, మౌనిక, శ్రీదేవి, పార్వతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టోల్ ఛార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలి

● పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద ధర్నా



ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా జిల్లా)

టోల్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పొట్టిపాడు టోల్‌గేటు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత టోల్ ఛార్జీల పేరుతో ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. శనివారం నుంచి మరో పది శాతం అదనంగా టోల్ ఛార్జీలు పెంచడం అన్యాయమని తెలిపారు. ప్రతి 40 కిలోమీటర్లకు ఒక టోల్‌గేట్ పెట్టి వాహన చోదకులను దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా ప్రజలంతా పెద్దఎత్తున ఉద్యమించాలని కోరారు. రోడ్డు నిర్మాణానికి అయిన ఖర్చు మొత్తం వసూలైన ప్రాంతాల్లో టోల్ గేట్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకుల నిరసనను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా..నాయకులు తన నిరసనను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, టీవీ లక్ష్మణస్వామి, కళ్లం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యం అభివృద్ధికి కృషి

● ఔషధ ఉత్పత్తుల నూతన కేంద్రం ప్రారంభించిన టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్

ఆయుర్వేద వైద్యాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి తెలిపారు. నర్సింగా పురంలోని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద ఫార్మసీలో నూతనంగా నిర్మించిన ఔషధ ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని వారు శుక్రవారం లాంఛనం గా ప్రారంభించారు. అనంతరం వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ భవనాలను ఆధునీకరించడంతో పాటు, మూడు ఔషధ ఉత్పత్తి కేంద్రాలను నిర్మించి రూ.3.90 కోట్లతో అధునాతన యంత్ర పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతగా ఔషధ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకూ ఏడాదికి రూ.1.5 కోట్లు విలువైన మందులను తయారు చేసే ఈ ఫార్మసీలో, ఇకపై ఏడాదికి రూ.ఐదు కోట్లు విలువైనమ మందులను తయారు చేసే సామర్థ్యం లభిస్తుందని తెలిపారు. టిటిడి అవసరాలకు పోనుమిగిలినవి ఆయుష్ వైద్యశాలలకు విక్రయించేలా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెఇఒ సదా భార్గవి, చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, సూపరింటెం డెంట్ డాక్టర్ రేణు దీక్షిత్, ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుందరం, ఇఇ మురళీకృష్ణ, విజిఒ మనోహర్, ఆయుర్వేద ఫార్మసీ సాంకేతిక అధికారి డాక్టర్ నారపరెడ్డి పాల్గొన్నారు.

గోశాలలో రోజుకు రూ. నాలుగు వేల లీటర్ల పాల ఉత్పత్తి

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టిటిడికి రోజువారీ అవసరమయ్యే నాలుగు వేల లీటర్ల పాలను ఎస్‌వి గోశాలలోనే ఉత్పత్తి చేసుకునే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని వైవి సుబ్బారెడ్డి తెలిపారు. టిటిడి తయారు చేస్తున్న అగరబత్తీల ఉత్పత్తిని డిమాండ్‌కు తగినట్లుగా పెంచే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్‌వి గోశాలలో నిర్మించిన ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్, టిటిడి ఆలయాల్లో ఉపయోగించిన పువ్వులతో తయారు చేసే అగరబత్తుల రెండో యూనిట్‌ను ఛైర్మన్, ఇఒలు ప్రారంభించారు.

అమరావతే గెలుస్తుంది

● టిడిపి అధినేత చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతే గెలుస్తుందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. రాజధాని రైతుల 1200 రోజుల ఉద్యమంపై ట్విట్టర్‌లో ట్విట్ చేశారు. 1200 రోజుల పోరాటానికి అభినందనలు అని, రైతుల ఉద్యమంలో న్యాయం, ధర్మం ఉందని తెలిపారు. అందుకే ఆంక్షలు, వేధింపులు, సంకెళ్లను ఎదిరించి ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. అంతిమంగా గెలిచేది, నిలిచేది అమరావతే అని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తరువాత కియాను తరిమేస్తానని ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ అన్నారని, అందుకు సంబంధించిన వీడియోను ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కియాపై గతంలో జగన్ వ్యాఖ్యలు, యువగళంలో లోకేష్ విడుదల చేసిన సెల్ఫీ ఛాలెంజ్‌ను ప్రస్తావించారు. జగన్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. వీటికి సమాధానం చెప్పంటూ జగన్‌ను ప్రశ్నించారు. బిజెపి నేత సత్యకుమార్ వాహనంపై జరిగిన దాడిని చంద్రబాబు ఖండించారు.

'ఇదేం కర్మ' నెలాఖరుకు పూర్తికావాలి

'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ఈ నెలాఖరుకు పూర్తిచేయాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆ పార్టీ నేతలకు సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణపై క్లస్టర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, వేగవంతం చేయాలని చెప్పారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లోని వ్యతిరేకత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైందని తెలిపారు. ఈ ఎన్నికల్లో 108 నియోజకవర్గాల పరిధిలోని కార్యకర్తలు, నేతలు కష్టపడి పనిచేశారని అభినందించారు. ఏప్రిల్ మొదటి వారంలో మూడు జోనల్ సమావేశాలు పూర్తిచేసుకుని తాను కూడా పలు జిల్లాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు.

ప్రధానితో ఏం చర్చించారు? : అశోక్‌బాబు

సిఎం జగన్ ఢిల్లీలో ప్రధానితో ఏం చర్చించారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందని టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు అన్నారు. దీనిపై సమాధానం చెప్పకుండా చిల్లర ఆరోపణలు, చౌకబారు ఆరోపణలను ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని అన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ మీడియాకు ఒకటే కాగితం ఇస్తున్నారని విమర్శించారు. కేసుల భయంతోనే ఢిల్లీకి వెళ్తున్నారన్నారు.

మండలిలో మరింత బలంగా వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలిలో వైసిపికి బలం మరింత పెరగనుంది. మొత్తం 58 శాసనమండలి సభ్యుల్లో మే చివరి నాటికి 46 స్థానాలు వైసిపికి రానున్నాయి. మార్చి 30వ తేదీతో పలువురు అభ్యర్థుల పదవీ కాలం పూర్తయింది. పిడిఎఫ్ నుంచి వి బాలసుబ్రమణ్యం, వై శ్రీనివాసులురెడ్డి, స్వతంత్ర ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, టిడిపి నుంచి నారా లోకేష్, జి దీపక్‌రెడ్డి, మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బచ్చుల అర్జునుడు, వైసిపి నుంచి డొక్కా మాణిక్యవరప్రసాద్, పోతుల సునీత, గంగుల ప్రభాకర్ రెడ్డి, చల్లా భగీరథరెడ్డి, వెన్నపూస గోపాల్‌రెడ్డి, పెనుమాత్స సూర్యనారాయణ రాజు, బిజెపి నుంచి పివిఎన్ మాధవ్ పదవీ కాలం పూర్తయింది. స్థానిక సంస్థల కోటాలో మే 1వ తేదీ నుంచి టిడిపి నుంచి కెఇ ప్రభాకర్, అంగర రామ్మోహన్‌రావు, వి నారాయణ రెడ్డి, శత్రుచర్ల రామరాజు, చిక్కాల రామచంద్రరావు, మంతెన వెంకట సత్యనారాయణ, బిఎన్ రాజసింహులు, గవర్నర్ కోటాలో ఎన్ఎండి ఫరూక్, సిహెచ్ శివనాథరెడ్డి పదవీ కాలం పూర్తికానుంది. ఇటీవల 19 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. స్థానిక సంస్థలు, పట్టభద్ర, ఉపాధ్యాయ, ఎమ్మెల్యేల కోటా నుంచి 19 మంది ఎన్నికయ్యారు. వీటిల్లో 15 స్థానాలను వైసిపి గెలుచుకుంది. మిగిలిన నాలుగు స్థానాలను టిడిపి గెలుచుకుంది. వైసిపి నుంచి ఎమ్మెల్యేల కోటాలో పోతుల సునీత, జయమంగళం వెంకట రమణ, చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్, సూర్యనారాయణ రాజు, ఇజ్రాయిల్, టిడిపి నుంచి పంచుమర్తి అనురాధ విజయం సాధించారు. మూడు పట్టభద్రుల స్థానాల్లో టిడిపి విజయం సాధించింది. రెండు ఉపాధ్యాయ స్థానాల నుంచి వైసిపి తరపున ఎంవి రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి విజయం సాధించారు. స్థానిక సంస్థల కోటాలో కడప నుంచి పి రామసుబ్బారెడ్డి, చిత్తూరు నుంచి సిపాయి సుబ్రమణ్యం, అనంతపురం నుంచి మంగమ్మ, శ్రీకాకుళం నుంచి నర్తు రామారావు, పశ్చిమ గోదావరి నుంచి కవురు శ్రీనివాస్, ఏలూరు నుంచి వంకా రవీంద్రనాథ్, కర్నూలు నుంచి మధుసూదన్ విజయం సాధించారు. మొత్తం 58 స్థానాల్లో వైసిపి తరపున 46 మంది సభ్యులు ఉండనున్నారు. విపక్షాలుగా టిడిపి నుంచి ఇటీవల గెలిచిన నలుగురితోపాటు యనమల రామకృష్ణుడు, పి అశోక్ బాబు, బిటి నాయుడు, దువ్వారపు రామారావు ఉంటారు. పిడిఎఫ్ నుంచి కెఎస్ లక్ష్మణరావు, షేక్ సాబ్జీ, ఐ వెంకటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థిగా పాకలపాటి రఘువర్మ కొనసాగుతారు.

చిన్నారి వైద్య ఖర్చులు చెల్లించలేక..
అప్పల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా)

కన్న కూతురి కేన్సర్ చికిత్స కోసం చేసిన అప్పులు, వ్యవసాయంలో నష్టాలు రావడంతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..అల్లపల్లి పంచాయతీ పరిధిలోని మూగనపల్లి గ్రామానికి చెందిన రైతు రమేష్‌రెడ్డి (35) దంపతుల కుమార్తె నైనిక ఏడాదిగా కేన్సర్‌తో బాధపడుతోంది. బిడ్డను బతికించుకునేందుకు చికిత్స కోసం దాదాపు రూ.12 లక్షలు అప్పు చేశారు. అప్పులకు వడ్డీభారం అధికమైంది. అప్పు తీర్చేందుకు మూడు ఎకరాల్లో వేరుశనగ, కూరగాయల పంటలు సాగుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట మొత్తం దెబ్బతిన్నది. రుణదాతల వేధింపులు తాళలేక పొలం వద్దే చెట్టుకు ఉరేసుకుని రమేష్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు.

ప్రభుత్వం స్పందించి కేన్సర్‌తో బాధపడుతున్న చిన్నారిని ఆదుకోవాలని, కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రూఅప్ భారాలను ఉపసంహరించుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై ప్రతినెలా భారాలు మోపటాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. ప్రజారంజక పాలనంటే పదేపదే విద్యుత్ భారాలు ప్రజలపై మోపటమేనా? అని ప్రశ్నించారు. కేంద్ర తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలకు తలొగ్గి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత విధానాలతో మరో విద్యుత్ ఉద్యమానికి ఆస్కారమివ్వొద్దని హెచ్చరించారు.

విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీలో హాస్టల్ నుంచి ఎస్ఎఫ్ఐకి చెందిన ఐదుగురు నాయకులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలను, యూనివర్సిటీ నిర్వహణ లోపాలను ఎత్తిచూపినందుకు గానూ ఎస్ఎఫ్ఐ నాయకత్వాన్ని హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. తక్షణమే ఈ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, డీన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి మండలంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. సహజీవనం చేస్తున్న మహిళే ఈ దారుణానికి పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన గద్దె రాము (30) పండ్లను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రాంతం నుంచి వచ్చిన ఆమని దంపతులు తెనాలి కొరవరం కాల్వకట్టపై ఉండేవారు. ఆమనితో తన భర్త గొడవపడి ఎటో వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఆమెకు రాముకు పరిచయం ఏర్పడింది. మూడేళ్లుగా వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారు. ఆమని మరొకరితో సన్నిహితంగా ఉంటుందని తరుచూ రాము గొడవపడేవాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో ఉన్న రామును ఆమని గొంతుకోసి హతమార్చింది. నిందితురాలిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పదవి లేకపోయినా బాధపడను : మంత్రి సీదిరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తనకు మంత్రి పదవి ఉన్నా.. లేకపోయినా బాధపడనని పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. మంత్రి పదవి కన్నా తనకు ప్రజా సేవే ముఖ్యమని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. తన దృష్టిలో వైసిపి ఎమ్మెల్యేలందరూ మంత్రులేనని అన్నారు. బిసి తరగతి నుంచి వచ్చిన తనకు సిఎం జగన్ మంత్రి పదవిని ఇచ్చారని చెప్పారు. మంత్రి పదవి నుంచి తొలగిస్తారన్న సమాచారం తనకు లేదన్నారు. మీడియా లోనే ఏవేవో కథలు వస్తున్నాయని పేర్కొన్నారు.

కార్పొరేట్ల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టాలి

● హెచ్చు ధరలకు అ ఐదే కారణం ● ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయి
● ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య విమర్శ



న్యూఢిల్లీ : భారత్‌లో అధిక ధరలకు ఐదు బడా కార్పొరేట్ కంపెనీలే కారణమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ విరాల్ ఆచార్య స్పష్టం చేశారు. రిలయన్స్ గ్రూపు, అదాని, టాటా, ఆదిత్యా బిర్లా, భారతి టెలికం గ్రూపు కంపెనీలు గుత్తాదిపత్యంతో ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తూ.. ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నాయన్నారు. అవి భారత్‌లో వివిధ ఉత్పత్తులు, సేవల ధరల్ని అమాంతం పెంచే శక్తిని కలిగి ఉన్నాయన్నారు. అంతర్జాతీయంగా ముడి సరుకుల ధరలు తగ్గినప్పటికీ ఈ దిగ్గజ కార్పొరేట్ వర్గాలు ఇక్కడ ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయన్నారు. బ్రూకింగ్ ఇన్స్టిట్యూట్ కాన్ఫరెన్స్‌లో ఆచార్య ఓ పత్రాన్ని ప్రవేశపెట్టారు. అందులో కార్పొరేట్ల ఆగడాలను ఎండగట్టారు. ధరల్ని నిర్ణయించే శక్తి కార్పొరేట్ దిగ్గజాలకు పెరుగుతూనే ఉన్నందున ద్రవ్యోల్బణం ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. పోటీని పెంచడానికి, ధరల శక్తిని తగ్గించడానికి ఈ గుత్తేదారులను విచ్ఛిన్నం చేయాలన్నారు. 2017 జనవరి 23 నుంచి 2019 జులై 23 మధ్య మధ్య ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్‌గా విరాల్ ఆచార్య పని చేశారు. ప్రస్తుతం ఆయన న్యూయార్క్ యూనివర్శిటీ స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన పత్రంలో పేర్కొన్న అంశాలు.. "అధిక ధరలకు కారణమవుతున్న ఈ వాణిజ్య గ్రూప్‌లను విచ్ఛిన్నం చేయాల్సి ఉంది. ఆ ఐదు దిగ్గజ గ్రూపులు స్థానిక చిన్న సంస్థల్ని దిగమింగి బడా గ్రూపులుగా ఎదిగాయి. రిటైల్ వ్యాపారం, సహజ వనరులు, టెలికమ్యూనికేషన్ల రంగాల్లో ధరల్ని పెంచే శక్తి వీటికే ఉంది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు ఆ కార్పొరేట్లు మద్దతుగా నిలుస్తున్నారు. ప్రభుత్వం భారీగా పెంచేసిన దిగుమతి సుంకాలతో విదేశీ పోటీ సంస్థల నుంచి దేశంలోని పెద్ద వాణిజ్య గ్రూప్‌లు రక్షణ పొందుతున్నాయి. జాతీయ వాణిజ్య చాంపియన్లను తయారు చేయడం నవ భారత్ పారిశ్రామిక విధానమని చెపుతున్నారు. కానీ ఈ విధానం పరోక్షంగా అధికస్థాయిలో ధరలు కొనసాగేలా చేస్తుంది. మార్కెట్లో పోటీ పెరగడానికి, ధరల్ని నిర్ణయించే శక్తిని తగ్గించడానికి కార్పొరేట్ దిగ్గజాలను విడగొట్టాలి." అని విరాల్ ఆచార్య అన్నారు. "కార్పొరేట్ దిగ్గజాలను విడగొట్టలేకపోతే వాటి వృద్ధి చక్రాల్లో ఇసుక పోయాలి. అప్పుడు వాటికి ఆర్థికంగా గిట్టుబాటు కాదు. ముడి పదార్థాల ధరలు బాగా తగ్గినప్పటికీ, భారత వినియోగదారులకు ఆ ఫలాలు పూర్తిగా అందడం లేదు. లోహాలు, బొగ్గు, పెట్రోలియం, రిఫైనరీ ఉత్పత్తులు ఆ ఐదు దిగ్గజాల చేతుల్లోనే ఉన్నాయి. ఇవి కాకుండా రిటైల్ వ్యాపారం, టెలికం సర్వీసుల్లో కూడా వారే గుత్తాధిపత్యాన్ని కలిగి ఉన్నారు. 2010 తర్వాత విత్త యేతర రంగాలను పూర్తిగా చేజిక్కించుకోవడంపైనే ఆ ఐదు కార్పొరేట్ దిగ్గజాల దృష్టి పడింది. అనుకున్నట్లుగానే 2015-16 నాటికి పలు రంగాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. వ్యాపారాలను భారీగా పెంచుకున్నారు. దేశంలో టాప్ 5 కంపెనీలుగా ఎదిగాయి. ఇతరుల చేతుల్లోని ఉన్న కంపెనీల్లోని మెజారిటీ వాటాలను చేజిక్కించుకోవడం ప్రారంభించారు. దివాళా తీసిన కొన్ని పెద్ద సంస్థలను స్వాధీనం చేసుకున్నాయి. ఇది వాటి మరింత వృద్ధికి దోహదం చేశాయి." అని విరాల్ విశ్లేషించారు. పోటీని పెంచడానికి, ధరల శక్తిని తగ్గించడానికి ఈ గుత్తేదారులను విచ్ఛిన్నం చేయాలని, ఇందుకోసం పోటీతత్వాన్ని పెంచడంతో పాటుగా రెగ్యులేటరీ నియంత్రణలు పెంచాలని విరాల్ అన్నారు.

'ఉక్కు'పోరాటం మరింత ముందుకు...

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ బారి నుంచి రక్షించుకునే వరకూ పోరాటం కొనసాగుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 778వ రోజుకు చేరుకున్నాయి.

సంపాదకీయం

అభినందనలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ రాజధాని ప్రాంత గ్రామాల ప్రజలు మొక్కవోని దీక్షతో చేపట్టిన ఉద్యమానికి శుక్రవారంతో 1200 రోజులు పూర్తయ్యాయి. ఉద్యమాన్ని అణిచేసేందుకు ప్రభుత్వం ఎన్ని ఒత్తిళ్లకు పాల్పడినా..పోలీసులతో వేధింపులకు గురి చేసినా పోరుబాట వీడకుండా సామాన్య ప్రజానీకం సుదీర్ఘకాలంగా పోరు సాగిస్తుండటం అభినందనీయం. ఢిల్లీని తలదన్నేలా అమరావతి నిర్మిస్తామంటూ శంకుస్థాపన సమయంలో గుప్పెడు మట్టి చెంబుడు నీళ్లు కుమ్మరించి వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆ తర్వాత అతీగతీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇక్కడి బిజెపి నేతలు మాత్రం అమరావతికి అన్యాయం జరిగిపోతోందంటూ మొసలి కన్నీరు కారుస్తూ కపట నాటకాలు ఆడుతున్నారు. కానీ నాడు భూసమీకరణ సమయంలో టిడిపి ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ప్రశ్నించి..నేడు రాజధాని తరలింపు యత్నాలతో వైసిపి ప్రభుత్వ వంచనలను నిలదీస్తూ రాజధాని ప్రాంత పేదలకు, రైతులకు అండదండగా నిలిచింది ఒక్క ఎర్రజెండానే. ఉద్యమం 1200 రోజులకు చేరుకున్న సందర్భంగా మరోమారు సంపూర్ణ మద్దతు ప్రకటించి మార్క్సిస్టు పార్టీ తన నిబద్ధతను చాటుకుంది.

రాజధాని విజయవాడలో పెట్టినా, గుంటూరులో పెట్టినా మనస్ఫూర్తిగా అభ్యంతరమే లేదు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టరాదనే రాజధానిగా అమరావతిని స్వాగతిస్తున్నాం. అంటూ ప్రతిపక్ష నేత హోదాలో శాసనసభలోనూ, 'టిడిపి అధినేత చంద్రబాబు తాత్కాలిక నివాసంలో ఉంటున్నారు. నేను ఇదే అమరావతిలో శాశ్వత నివాసం నిర్మించుకున్నా..రాజధాని మార్చే ప్రసక్తే లేదు' అంటూ ఎన్నికల ప్రచారంలోనూ హామీలు కుమ్మరించిన ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే తన హామీలపై తానే నీళ్లు కుమ్మరించారు. 2019 డిసెంబరు 17న శాసనసభలో మూడు రాజధానులంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అదిగో కర్నూలు..ఇదిగో విశాఖ అంటూ కాలం వెళ్లదీస్తూ వస్తున్నారే మినహా రాజధాని చిక్కు ముడి విప్పడం లేదు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు ఈ దుస్థితి పట్టడానికి ప్రధాన ముద్దాయి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే. అమరావతి నిర్మాణానికి రూ.42 వేల కోట్లు అవసరమని నాటి టిడిపి - బిజెపి ప్రభుత్వం కేంద్రానికి నివేదించినా..రూ.1500 కోట్లుతో సరిపెట్టింది. భారీ సినిమా గ్రాఫిక్స్‌లా రాజధానిని చూపించి సారవంతమైన 35 వేల ఎకరాలను భూసమీకరణ పేరిట రైతుల నుండి తీసుకున్న తెలుగుదేశం ప్రభుత్వం తాత్కాలిక భవనాలనే నిర్మించగలిగింది. ఆచరణ సాధ్యమైన, పరిపాలనా రాజధానిని పరిమిత ప్రాంతంలో చేపట్టివుండాల్సింది.

మూడు రాజధానుల విషయంలోనూ మోడీ సర్కార్ గోడమీద పిల్లి వాటం ప్రదర్శిస్తోంది. 42 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అమరావతిలో స్థలాలు కేటాయించినా, నిర్మాణాలు ప్రారంభించలేదంటే కేంద్రం మతలబు ఏమిటి? అమరావతి మెట్రో రైల్ ఊసులేమయ్యాయి? ఇవన్నీ బిజెపిని బోనులో నిలిపే ప్రశ్నలే. బిజెపి-వైసిపి కుమ్మక్కు అయ్యే ప్రస్తుత మూడు రాజధానుల వంచన పూరిత వ్యూహానికి తెరలేపాయా అన్న సందేహం కలగమానదు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలంటే వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించి ఆ మేరకు అవసరమైన నిధులను ప్రత్యేకంగా కేంద్రం నుంచి రాబట్టుకోవాలి. కానీ ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలను విన్నపాలకు సరిపెడుతున్నారే మినహా.. 'మెడలు వంచి నిధులు, హోదా సాధించుకు'నే పోరాటస్ఫూర్తి లేదు. ఇకనైనా బిజెపి మోసాన్ని గుర్తించి ఇక్కడి పాలకులు కళ్లు తెరవాలి. రాజధాని, పోలవరం నిర్మాణ నిధులతో సహా రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన ప్రత్యేక హోదా, నిధులు రాబట్టుకోవాలి. అమరావతి విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమల్జేయకుండా సుప్రీంకోర్టులో సవాలు చేసి భంగపాటుకు గురైన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి వీడాలి. అమరావతి రైతుల డిమాండ్లను పరిష్కరించాలి.

మహనీయుల మాట



నా శత్రువు నోరు విప్పకుండా చేయగల
బలం, బలగం, అధికారం నాకు వున్నప్పటికీ
అతను తన అభిప్రాయాలను వెల్లడించే
స్వేచ్ఛను నేను హరించను.
చివరికి అతని మాటలు
నాపై విమర్శలైనా సరే!
అదే ప్రజాస్వామ్యం.

- అబ్రహం లింకన్

Abraham Lincoln

విమర్శ

భయం గుప్పెట్లో త్రిపుర ప్రజలు



సుహృద్ శంకర్ ఛటోపాధ్యాయ

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించింది. మార్చి 8వ తేదీన మాణిక్ షా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా హాజరయ్యారు. అదే రోజున నిరుపేద రిక్షా డ్రైవర్ హరిమోహన్ ఘోష్ తన ఇంటికి వెళ్లేసరికి ధ్వంసమైన పశువుల పాక, మంటల్లో కాలి చనిపోయిన రెండు ఆవులు, ధ్వంసమైన రిక్షా దర్శనమిచ్చాయి. ఘోష్ భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) కార్యకర్త అని స్థానిక పాలక పార్టీకి తెలిసిన తర్వాత ఇల్లు వదిలి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. అతను ఇంట్లో లేని సమయంలో మార్చి 8వ తేదీ తెల్లవారుజామున కాషాయ పార్టీకి చెందిన అల్లరిమూక పశువుల కొష్టాన్ని తగులబెట్టింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి, ఇన్‌డైజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐ.పి.ఎఫ్.టి) కూటమి విజయం సాధించిందని, రెండవసారి అధికారాన్ని చేపడుతుందనే ప్రకటన వచ్చిన నాటి (మార్చి 2) నుండి ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు, సభ్యుల మీద వెయ్యికి పైగా దాడులు జరిగాయి. ఎన్నికల అనంతరం జరిగిన హింస ఏ స్థాయిలో వుందంటే...ఆఖరికి నిజనిర్ధారణ కమిటీ సభ్యులైన ప్రతిపక్ష పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలను కూడా విడిచి పెట్టలేదని సిపియం నాయకత్వంలోని వామపక్ష కూటమి, కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నారు.

ఏకైక ఎజెండా

ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మార్చి 2వ తేదీ నుండి జరుగుతున్న రాజకీయ హింస కారణంగా...త్రిపుర రాష్ట్ర ప్రజలు మానసిక, భౌతిక దాడులను ఎదుర్కొంటున్నారు. ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ మద్దతుదారులు, కార్యకర్తలు బిజెపి చేతిలో నిత్యం దాడులకు గురవుతున్నారు. వారి ఇళ్లు, జీవనాధారంగా ఉన్న దుకాణాలు, ఇతర ఆస్తులన్నింటినీ ధ్వంసం చేశారు. దాదాపు వెయ్యిమందికి పైగా ఇళ్ళను వదిలిపెట్టి వెళ్ళిపోయారు. వామపక్ష పార్టీలకు, కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారులుగా ఉన్నారు కాబట్టి వారు ఇంటికి తిరిగి రావాలంటే డబ్బు చెల్లించాలని పాలక బిజెపి మద్దతుదార్లు ఒత్తిడి చేశారు. స్థానిక బిజెపి నాయకునికి రూ.50 వేలు చెల్లించిన తరువాత మాత్రమే తాను ఇంటికి రాగలిగానని సెపాహిజాల జిల్లాకు చెందిన సిపియం కార్యకర్త ఒకరు చెప్పారు. వారికి డబ్బు చెల్లించడంతో పాటు ఇకముందు ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనని ప్రమాణం చెయ్యాల్సి వచ్చిందని కూడా ఆయన వాపోయాడు.

"ప్రతిపక్షాన్ని, ప్రజాస్వామిక కార్యకలాపాలను లేకుండా నాశనం చేయడమే భారతీయ జనతా పార్టీ ఏకైక ఎజెండా. బిజెపి అధికారం లోకి వచ్చిన 2018 నుండి, ఐదు సంవత్సరాలుగా తన రాజకీయ ప్రత్యర్థుల్లో ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నది. ఎలక్షన్ కమిషన్ పుణ్యమా అని ఈ భయానక వాతావరణానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ పరిస్థితుల్లో బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేసి ఓడించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలి వచ్చారు. దాని ఫలితంగానే బిజెపి ఓట్ల భాగస్వామ్యం భారీగా తగ్గింది. తన వ్యతిరేక ఓట్లు చీలినందున బిజెపి విజయం సాధించింది. మళ్ళీ అధికారం చేపట్టిన తరువాత తమకు ఓట్లు తగ్గిన ప్రాంతాల్లో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. పార్లమెంటరీ ప్రతినిధుల సందర్శన సందర్భంగా ఈ విషయాలు బహిర్గతమయ్యాయి" అని త్రిపుర సిపియం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి చెప్తున్నారు.

దాడులకు పాల్పడుతున్న బిజెపి వారు, దాడులు చేస్తున్నట్లు కనిపించకుండా ఉండేలా, తమ అసలు ఎజెండాను చాలా నేర్పుగా అమలుచేసేలా జాగ్రత్తలు తీసుకున్నారని చౌదరి వెల్లడించారు. ఇప్పుడు సిపిఐ(యం), కాంగ్రెస్ పార్టీల మద్దతుదార్లు, కార్యకర్తలు వెళ్ళి తమ పనులు తాము చేసుకొని, తమ జీవనోపాధిని సంపాదించుకోకుండా, తమ దుకాణాలు తెరిచి, వ్యాపారం చేసుకోకుండా బిజెపి దౌర్జన్యకారులు అడ్డుకుంటున్నారు. వారు ప్రతిపక్షాల వారిని భౌతికంగా హత్య చేయకపోవచ్చు. కానీ వారిని ఆర్థికంగా నాశనం చేస్తున్నారు. మార్చి 16వ తేదీ నాటికి, వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి వ్యతిరేకంగా 2000 పైగా కేసులు నమోదయ్యాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు నిలబడి చోద్యం చూస్తున్నారు. దాడులను ప్రతిఘటిస్తున్న వారిని మాత్రం అరెస్ట్ చేస్తున్నారని జితేంద్ర చౌదరి చెప్పారు.

అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి వ్యతిరేకత ఉన్నప్పటికీ, విజయం సాధించే విధంగా బిజెపి పథకాలు రచించింది. ప్రతిపక్ష పార్టీల గొంతుకలను అణిచివేయడం ద్వారా ప్రజాస్వామిక క్రమాన్ని బలహీనపరిచేందుకు పాలకపార్టీ తెగబడింది. అందుకు పాల్పడిన బెదిరింపు ధోరణులు, హింసాత్మక చర్యలే ప్రభుత్వం పట్ల వ్యతిరేకతకు గల కారణాల్లో ప్రధానమైనది. ఎన్నికల్లో బిజెపి, ఐపిఎఫ్‌టి కూటమి 2018లో సాధించిన (మొత్తం 60 సీట్లకు 44 సీట్లు) విజయానికి పూర్తి భిన్నంగా ఇప్పుడు కేవలం 33 సీట్లలో మాత్రమే విజయం సాధించింది. త్రిముఖ పోటీ జరిగినందునే తమకు అనుకూలమైన ఫలితాలొచ్చాయని బిజెపి నేతలే ఒప్పుకున్నారు. కొన్ని గిరిజనేతర నియోజకవర్గాల్లో టిపిఎంఆర్ఎ ఓట్లు చీల్చింది. అలా జరగనట్లయితే ఐదు నుండి ఆరు స్థానాలను తాము లెఫ్ట్-కాంగ్రెస్ కూటమి చేతిలో కోల్పోయేవారమన్నది బిజెపి ప్రతినిధి మాట.

ఎన్నికల అనంతరం జరిగిన హింస స్వభావరీత్యా గతంకన్నా భిన్నంగా ఉంది. బిజెపి ఈసారి భౌతికంగా కంటే ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు, కార్యకర్తల జీవనోపాధిని లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడిందని వామపక్ష రాజకీయ పరిశీలకుడు, సీనియర్ జర్నలిస్ట్ రాహుల్ సిన్హా అభిప్రాయపడ్డారు. మొదటి ఐదు సంవత్సరాల్లో ఎక్కువగా భౌతిక దాడులు చేశారు. ఇరవై ఐదు మంది వామపక్ష పార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు హత్యగావించబడ్డారు. ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులే వేల సంఖ్యలో దాడులకు గురయ్యారు. వారి పార్టీల కార్యాలయాల్ని ధ్వంసం చేశారు. ఇళ్లను తగులబెట్టారు. ఈసారి ప్రజల జీవనోపాధిని లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు.

ఒకరికి రబ్బర్ తోట ఉందనుకోండి. ఆ తోటను ధ్వంసం చేస్తారు. లేకుంటే ఆటో రిక్షా లేదా దుకాణం లేదా ఏదైనా చిన్న వ్యాపారం. వేరే ఎలాంటి వనరులు లేకుండా...ఒకవేళ వ్యవసాయం చేయడానికి మోటార్ పంపుసెట్టు ఉంటే దాన్ని ఎత్తుకెళ్లి పోతారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు తమ ఇళ్ళకు తాము రావడానికి పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేసినట్టు అనేకమంది తెలిపారు. జీవనోపాధిని పునరుద్ధరించుకుని, మళ్ళీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనకుండా భయపెట్టి ప్రజల్ని అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. దాంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతిన్నది.

ప్రస్తుత బిజెపి పాలనలో ఉన్నంత భయానకమైన పరిస్థితులు... సిపిఎం పాలనా కాలంలో లేవని త్రిపుర రాష్ట్ర పిసిసి కార్యదర్శి హిమాన్షుకర్ చెప్తున్నారు. నాడు (సిపిఎం పాలనలో) ప్రతిపక్ష పార్టీ రాజకీయ కార్యకలాపాలు నిర్వహించుకునేది. తన అభిప్రాయాన్ని వినిపించేది. కానీ ఇప్పుడు ఒక పథకం ప్రకారం ప్రతిపక్షాల నోరు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారు.

కేంద్ర బృందం సందర్శన

హింసాయుత దాడులు ఏ మాత్రం తగ్గకుండా కొనసాగుతున్న పరిస్థితుల్లో...వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో ఏర్పడిన ఒక నిజనిర్ధారణ బృందం రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులతో కలిసి...దాడులు జరిగిన ప్రాంతాల్ని సందర్శించింది.

"వారు (బిజెపి వారు) గ్రామాల్లోకి ప్రవేశించి, ఎన్నికల ప్రచారంలో, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న సిపియం కార్యకర్తల్ని గుర్తించి, వారి ఇళ్ళను ధ్వంసం చేశారు. నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే మీకు కూడా ఇదే గతి పడుతుందని ఇరుగు పొరుగునూ బెదిరించారు. ఇది నిరంతరం కొనసాగుతూనే ఉంది. కానీ పోలీసులు వారి చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి కూడా వారు భయపడుతున్నారు" అని నిజనిర్ధారణ బృందం సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు బికాస్ రంజన్ భట్టాచార్య చెప్పున్నారు.

ఆఖరికి పార్లమెంటరీ బృందాన్ని కూడా విడిచి పెట్టలేదు. సెపాహిజాల జిల్లా లోని నేహాల్ చంద్రనగర్‌లో ఈ బృందం దాడికి గురైంది. ఎంపీలను, ఎన్నికైన శాసనసభ్యులనే ఈ విధంగా బెదిరిస్తే, సామాన్య ప్రజానీకం పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు. బెదిరింపులతో వారు ప్రజల నోళ్ళు నొక్కేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని భట్టాచార్య అంటున్నారు.

మొదట ఈ విషయాన్ని పార్లమెంటులో లేవనెత్తాలనుకున్నప్పటికీ, దీనివలన ఎలాంటి ఉపయోగం ఉండదని భట్టాచార్య భావించారు. ఇది రాష్ట్రానికి సంబంధించిన సమస్యని బిజెపి అంటుంది కాబట్టి దీనిని పార్లమెంట్‌లో ప్రస్తావించలేదు. ఈ భయానక వాతావరణాన్ని ప్రతిఘటించడానికి ప్రజల్ని ఐక్యం చెయ్యడమే ఏకైక పరిష్కారమని ఆయన అభిప్రాయపడ్డారు.

"త్రిపురలో చెలరేగుతున్న హింస హద్దులు దాటుతోంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొద్ది రోజులకే వెయ్యికి పైగా హింసాత్మక సంఘటనలు నమోదయ్యాయి. బిజెపి ప్రభుత్వ మద్దతుదార్లు రాష్ట్రంలో భారీ విధ్వంసక చర్యలకు పాల్పడుతున్నారు. ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరుల్ని లక్ష్యంగా చేసుకొని నేరగాళ్లు అనాగరిక దాడులకు పాల్పడుతున్నారు. భారీ సంఖ్యలో గృహాలు, ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. దహనం చేస్తున్నారు." అని సిపిఎం రాజ్యసభ సభ్యుడు వి.శివదాసన్ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ కు మార్చి 11న రాసిన లేఖలో పేర్కొన్నారు.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)

త్రిపురలో చెలరేగుతున్న హింస హద్దులు దాటుతోంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొద్ది రోజులకే వెయ్యికి పైగా హింసాత్మక సంఘటనలు నమోదయ్యాయి. బిజెపి ప్రభుత్వ మద్దతుదార్లు రాష్ట్రంలో భారీ విధ్వంసక చర్యలకు పాల్పడుతున్నారు. ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరుల్ని లక్ష్యంగా చేసుకొని నేరగాళ్లు అనాగరిక దాడులకు పాల్పడుతున్నారు. భారీ సంఖ్యలో గృహాలు, ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. దహనం చేస్తున్నారు.



విశ్లేషణ

రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమం రెండూ అవసరం



కె.యస్.లక్ష్మణరావు

ఆధునిక రాజ్యాలలో, రాష్ట్రాల్లో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలవలే ముందుకు వెళ్లాలి. కానీ, ఈ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు డి.బి.టి. పేరుతో ఇచ్చి ఉండవచ్చు గానీ, అభివృద్ధి దిశ మాత్రం లేదు. ముఖ్యంగా మనలాంటి వ్యవసాయాధారిత రాష్ట్రంలో జలవనరులు ఎంతో ప్రధానమైనవి. ఎన్నో ప్రాజెక్టులు పూర్తి కావలసి ఉంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, రాయలసీమలో హంద్రీ-నీవా, పోలవరం, ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. వీటికి నిధులు కేటాయించాలి. బడ్జెట్లో రూ. 11,908 కోట్లు కేటాయించారు. వెలిగొండ ప్రాజెక్టుకి కేవలం రూ.101 కోట్లు కేటాయించారు. దానికోసం ప్రకాశం జిల్లా ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. జలవనరులకు సంబంధించి తగిన ప్రాధాన్యతనివ్వలేదు.

వ్యవసాయ రంగానికి సంబంధించి...బడ్జెట్లో భాగంగా వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించారు. ఆ పుస్తకం 36 పేజీలు వుంది. మంత్రి గారి బడ్జెట్ ప్రసంగంలో కౌలు రైతుల గురించి కేవలం నాలుగు లైన్లు మాత్రమే ఉంది. ఈ రాష్ట్రంలో డెల్టా ప్రాంతంలో ఎనభై శాతం, మెట్ట ప్రాంతంలో అరవై శాతం కౌలు రైతులే సాగు చేస్తున్నారు. వ్యవసాయానికి రూ. ఆరు లక్షల కోట్ల రుణాలను ఇస్తే, రాష్ట్రం మొత్తంలో ఉన్న కౌలు రైతులకు కేవలం రూ. ఆరు వేల కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇదేమి న్యాయం?

కౌలు చట్టం-2019 కౌలు రైతులకు చాలా అడ్డంకిగా ఉంది. భూయజమాని కౌలు రైతుకు తన భూమిని కౌలుకు ఇస్తున్నట్లు సంతకం చేయాలి. సంతకం ఏ భూయజమాని చేస్తాడు? అందుకే వారు రుణ అర్హత కార్డులు పొందలేకపోతున్నారు. ఈ-క్రాపింగ్ నమోదు చేయలేకపోతున్నారు. రాష్ట్రంలో వ్యవసాయం చేస్తున్న రైతు అంటే కౌలు రైతే. అయినప్పటికీ ఈ బడ్జెట్‌లో కౌలు రైతులకు పూర్తిగా అన్యాయం జరిగింది.

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన పథకాల్లో ముఖ్యమైంది జగనన్న ఇళ్ల పథకం. ఆ పథకాన్ని మేం కూడా బలపరుస్తున్నాం. 30.2 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. పదహారు లక్షల ఇళ్లు ప్రారంభించారు. నాలుగు లక్షల ఇళ్లు పూర్తి కావస్తున్నాయని చెప్పారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు వెళ్లి ఇళ్ల కాలనీల లేఅవుట్లను చూశాను. పేద వారికి ఇళ్లు రావాలని మా కోరిక. ప్రభుత్వం ఇస్తున్న లక్షా ఎనభై వేలు, ముప్పై వేలు (ఈమధ్య డ్వాక్రా బృందాల ద్వారా ముప్పై వేలు ఇస్తున్నారు), మొత్తంగా రెండు లక్షల పది వేలు ఇస్తున్నారు (రూ. 1,50,000+30,000+30,000). అవి బేస్‌మెంటుకు కూడా సరిపోని పరిస్థితి. చాలా ఇళ్లు బేస్‌మెంట్లోనే ఆగిపోయిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం తరపు నుంచి ఇతోధిక సహాయం, వడ్డీ లేని బ్యాంకు రుణాలు ఇప్పిస్తే తప్ప ఆ ఇళ్లు పూర్తి కావు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాల్సి వుంది.

ప్రాథమిక పాఠశాల విద్యకు రూ. 29,000 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 2,000 కోట్లు కేటాయించారు. విద్యరంగానికి మొత్తం రూ. 31,000 కోట్లు కేటాయించారు. శాతాల్లో చూసినప్పుడు పెరుగుదల పెద్దగా లేదు. ఇక్కడ మూడు విషయాలు ప్రస్తావించుకోవాలి.

విద్యారంగంలో నాడు-నేడు కార్యక్రమం మొదటి దశ అయిపోయింది. రెండు, మూడో దశలు అమలుజరగాలి. అవి అమలు కావాలంటే ఎనిమిది వేల కోట్ల రూపాయలు కావాలి. తాజా బడ్జెట్‌లో రూ. 3,500 కోట్లు కేటాయించారు. చాలా స్కూల్ భవనాలు బేస్‌మెంట్, లెంటల్ లెవల్‌లో ఆగాయి.

జగనన్న విద్యాకానుక పథకం కింద స్కూల్ బ్యాగులు, బూట్లు, పుస్తకాలు, నోట్ బుక్కులు ఇస్తున్నారు. ఈ సంవత్సరంలో ఇచ్చిన వాటి గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. తొంభై శాతం బ్యాగులు చినిగిపోయాయి, బూట్ల నాణ్యత లోపించింది. నేను కొన్ని వందల స్కూళ్లకు వెళ్లి చూశాను. విద్యార్థులు షూస్ ఎందుకు వేసుకొని రావడంలేదని అడిగితే చినిగిపోయాయని చెబుతున్నారు. పథకాన్ని అమలు చేయడంలో లోపాలను అరికట్టాల్సిన అవసరం ఉంది.

'జగనన్న గోరు ముద్ద' పథకంలో మార్పులు తెచ్చారు. రకరకాల మెనూలు పెడుతున్నారు. కానీ అన్నం మెత్తగా మారిపోవడం వల్ల దాదాపు డెబ్భై శాతం విద్యార్థులు అన్నం తినడం లేదు. కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి అన్నం తెచ్చుకుని స్కూల్లో పెట్టే కూర కలుపుకొని తింటున్నారు. లోపాలను గుర్తించి సరిచేయాలి. విద్యారంగంలో క్షేత్ర స్థాయి పరిణామాలను గమనించాల్సిన అవసరం ఉంది.

బడ్జెట్‌కి సంబంధించి వృద్ధి రేటు 11.437 శాతం ఉందని, ఆర్థిక స్థిరత్వం ఉందని చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. 'తీవ్రమైన అసంతృప్తి' అనడానికి ఒక కారణం వుంది. పదకొండో వేతన సంఘం (పి.ఆర్.సి) సిఫారసుల్లో ఉద్యోగులకు అన్యాయం జరిగింది. గత మూడు నాలుగేళ్లుగా ఒక్క డి.ఎ రాలేదు. సుమారు ఐదు వేల కోట్ల రూపాయల పి.ఎఫ్ డబ్బులు ఉద్యోగులకు రావలసి ఉంది. ముఖ్యమంత్రి గారు మౌఖికంగా ఎన్నిసార్లు చెప్పినా ఆచరణకు వచ్చేటప్పటికి కింద స్థాయిలో మంజూరు కావడం లేదు. ఇప్పుడు ఎలా వుందంటే...'అవన్నీ మాకొద్దు. నెల మొదటి రోజే మాకు జీతాలు ఇవ్వండి సంతోషిస్తాం' అనే దశకు వచ్చింది. గత ఏడెనిమిది నెలల నుంచి పదవ, పన్నెండవ, పదిహేనవ తేదీలకు కూడా జీతాలు రావడం లేదు. ఉద్యోగులకు నెలనెలా కచ్చితంగా చెల్లించాల్సిన ఇఎంఐ లు, పాల బిల్లు, కరెంటు బిల్లు తదితరాలు ఉంటాయి. రాష్ట్రంలో ఆర్థిక స్థిరత్వం ఏర్పడిందని, జీఎస్‌డీపీ వృద్ధి రేటు బాగుందని, రాష్ట్ర ఆదాయం బాగుందని ఒక వైపు చెబుతున్నారు. కానీ ఇవన్నీ అమలు జరగాలి కదా!

పదకొండో వేతన సంఘం వచ్చి ఐదేళ్లు అయింది. రాష్ట్రాల స్థాయిలో ఐదేళ్లకు ఒకసారి కేంద్ర స్థాయిలో పదేళ్లకు ఒకసారి వేతన సంఘం వేస్తారు. ఇప్పుడు పన్నెండో పిఆర్‌సి వేయాల్సిన ఆవశ్యకత ఉంది. గవర్నర్ ప్రసంగంలో గానీ, బడ్జెట్‌లో గానీ పన్నెండో వేతన సంఘం గురించి ఎటువంటి ప్రస్తావనా లేదు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లానుకు సంబంధించిన చట్టం 2013లో చేయబడింది. అప్పుడు నేను శాసనపరిషత్ సభ్యునిగా ఉన్నాను. ఆ చట్టం అమలు రోజు మేమంతా మాట్లాడాం. ఆ చట్టం 2023తో అయిపోతుంది. బహుశా ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేస్తుంది, త్వరలో వస్తుంది. ఈ సబ్‌ప్లాన్‌ను మరింత నిర్దిష్టంగా అమలు చేయాలి. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్, కాంపోనెంట్ ప్రకారంగా ఎస్‌సి జనాభా పదహారు శాతం, ఎస్‌టి జనాభా ఏడు శాతం ఉంది. మొత్తం ఇరవై మూడు శాతం ఉంది. ఇరవై మూడు శాతం నిధులను ప్రతి డిపార్ట్‌మెంట్లో ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. కానీ పన్నెండు, పదిహేను శాతం ఖర్చు పెట్టినట్లు కనిపిస్తుంది తప్ప ఇరవై మూడు శాతం ఖర్చు చేసినట్లు కనపడదు. సబ్‌ప్లాన్‌కు అనుగుణంగా అన్ని డిపార్ట్‌మెంట్లు ఖర్చు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

వెనుకబడిన తరగతులకు సంబంధించి కార్పొరేషన్లను ఏర్పాటుచేశారు. నేను 2007లో శాసనపరిషత్ సభ్యునిగా ఎన్నిక అయినపుడు ఆనాడు రాజశేఖర్ రెడ్డి గారు కొన్ని కార్పొరేషన్లను ఏర్పాటుచేశారు. ఇప్పుడు దాదాపు 56 కార్పొరేషన్లను ఏర్పాటుచేశారు. ఆ కార్పొరేషన్ ఛైర్మన్లుగా నియమితులైన వారిలో నా విద్యార్థులు, నాకు మంచి పరిచయస్తులు ఉన్నారు. వారికి నిధులు లేవు, విధులూ లేవు. అవి లేకుండా ఒట్టి కార్పొరేషన్ల ఛైర్మన్లుగా, అలంకారప్రాయంగా నియమించడంలో ఉన్న ఆంతర్యం ఏమిటి? బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలను ముందుకు తీసుకువెళ్లడానికి ప్రయత్నించాలి. నిధులు కూడా పూర్తిగా కేటాయించాలి.

వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక వసతులు, సంక్షేమం, మానవాభివృద్ధి కలిసినపుడు మాత్రమే ఏ రాష్ట్రమైనా, ఏ దేశమైనా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది. డిబిటి ద్వారా రూ.1,97,000 కోట్లు బదిలీ చేశామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. కేవలం దానివల్లనే ప్రజలు సంతృప్తి చెందరు. రోడ్లు వేయాలి. ఎన్నో పనులు చేయాల్సి ఉంటుంది. ఒక ఎల్ఐసి ఉద్యోగి కారు కొన్నాడనుకుందాం. అతను డిబిటి గురించి ఆలోచించడు. రోడ్డు బాగుండాలని కోరుకుంటాడు. అలాంటి అవసరాలను ప్రజలకు సమకూర్చినపుడే సంతృప్తి ఉంటుంది. అభివృద్ధి సాధించడానికి అవకాశం ఉంటుంది. ఆ దిశగా కూడా ప్రభుత్వం ఆలోచన చేయాల్సి వుంది.

(వ్యాసకర్త: పిడిఎఫ్ ఎమ్మెల్సీ,
సెల్ : 9440262072)



పదకొండో వేతన సంఘం (పి.ఆర్.సి) సిఫారసుల్లో ఉద్యోగులకు అన్యాయం జరిగింది. గత మూడు నాలుగేళ్లుగా ఒక్క డి.ఎ రాలేదు. సుమారు ఐదు వేల కోట్ల రూపాయల పి.ఎఫ్ డబ్బులు ఉద్యోగులకు రావలసి ఉంది. ముఖ్యమంత్రి గారు మౌఖికంగా ఎన్నిసార్లు చెప్పినా ఆచరణకు వచ్చేటప్పటికి కింద స్థాయిలో మంజూరు కావడం లేదు. ఇప్పుడు ఎలా వుందంటే...'అవన్నీ మాకొద్దు. నెల మొదటి రోజే మాకు జీతాలు ఇవ్వండి సంతోషిస్తాం' అనే దశకు వచ్చింది. గత ఏడెనిమిది నెలల నుంచి పదవ, పన్నెండవ, పదిహేనవ తేదీలకు కూడా జీతాలు రావడం లేదు. ఉద్యోగులకు నెలనెలా కచ్చితంగా చెల్లించాల్సిన ఇఎంఐ లు, పాల బిల్లు, కరెంటు బిల్లు తదితరాలు ఉంటాయి. రాష్ట్రంలో ఆర్థిక స్థిరత్వం ఏర్పడిందని, జీఎస్‌డీపీ వృద్ధి రేటు బాగుందని, రాష్ట్ర ఆదాయం బాగుందని ఒక వైపు చెబుతున్నారు. కానీ ఇవన్నీ అమలు జరగాలి కదా!

జనవాక్యం

రివర్స్ పాలన

రాష్ట్రంలో పోలీసు సిబ్బంది కొరతతో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. గత నాలుగు సంవత్సరాలుగా సిబ్బంది నియామకాల్లేవు. ఈ నేపథ్యంలో ప్రజలకు రక్షణగా ఉండవల్సిన రక్షకభటులు నెల్లూరు నగరంలో ఓ ప్రజాప్రతినిధి ఫ్లెక్సీకి రక్షణగా విధులు నిర్వహించడం సిగ్గుచేటు. అసలు ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నిషేధించామనిపాలకులు ప్రచారం చేసుకుంటున్న వేళ...ఓ సి.ఐ. స్థాయి అధికారి పర్యవేక్షణలో ఫ్లెక్సీకి రక్షణగా విధులు నిర్వహించడం ఏమిటో! దీన్ని రివర్స్ పాలనగా భావించాలి మరి.

- జి.భారతీదేవి,
ఏలూరు, ఏలూరు జిల్లా.

వీధి దీపాలేవీ!

రాష్ట్ర హైకోర్టుకు వెళ్లే మార్గంలో వీధి దీపాల కోసం హైకోర్టు ఆదేశించినా దీపాలు ఏర్పాటు చేయలేదు. ఆపైన సీఆర్‌డిఎ కమిషనర్‌ని స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అప్పుడు కదిలి వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. నాలుగు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేయాల్సిన వీధి దీపాలకు ఇంత రభస జరిగితేగానీ పరిష్కారం లభించలేదు! ఇక ఈ పాలకులు మూడు రాజధానులు కడతామంటే ఎవరైనా నమ్ముతారా? ఇటువంటి బాధ్యతారాహిత్య పాలన గతంలో ఎన్నడూ చూడలేదు.

- జి.ఆర్

పోర్న్‌స్టార్‌తో వ్యవహారంలో బోనెక్కనున్న ట్రంప్

- అభియోగాలను ప్రాథమికంగా ధ్రువీకరించిన కోర్టు
- లొంగిపోతారా? అరెస్టవుతారా?



వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలో బోనెక్కనున్నారు. ట్రంప్ తనతో శృంగారం నడిపారని పోర్న్‌స్టార్ (శృంగార తార) చేసిన ఆరోపణలకు ఆధారాలున్నాయని కోర్టు ప్రాథమికంగా నిర్ధారించింది. మాజీ అధ్యక్షుడొకరు ఇటువంటి నేరాభియోగాలపై బోను ఎక్కనుండడం అమెరికా చరిత్రలో బహుశా ఇదే మొదటిసారి. ఆరోపణలను కోర్టు ప్రాథమికంగా ధ్రువీకరించడంతో ట్రంప్ ఇప్పుడు విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆయన అరెస్టు తప్పదనే వార్తలు వస్తున్నాయి . మన్‌హటన్ గ్రాండ్ జ్యూరీ ట్రంప్‌ను తప్పుపట్టింది. వచ్చే ఏడాది జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయాలన్న ట్రంప్ యత్నాలకు తాజా పరిణామం ఓ గట్టి ఎదురు దెబ్బ అని పరిశీలకులు భావిస్తున్నారు.

డొనాల్డ్ ట్రంప్, పోర్న్ స్టార్ మధ్య శృంగార భాగోతం 2006లో తొలిసారి చోటుచేసుకుంది. రియల్ ఎస్టేట్ దిగ్గజం ట్రంప్ 2006 జులైలో ఓ గోల్ఫ్ టోర్నీలో పాల్గొన్నప్పుడు స్టార్మీ డానియల్ (44) ను తొలిసారి కలుసుకున్నారు. 2007లో మరోసారి కలుసుకున్నారు. ట్రంప్ తనతో లైంగిక సంబంధం పెట్టుకున్నారని 2018లో ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ కార్యక్రమంలో పోర్న్‌స్టార్ బయటపెట్టారు. అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ఈ అంశం ముందుకు రాగా డబ్బుల కోసమే ఆమె ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని ట్రంప్ ఎదురు దాడి చేశారు. తానే తప్పు చేయలేదని చెప్పుకుంటూ వచ్చారు.. ఈ ఆరోపణలపై విచారణ జరిపిన మన్‌హటన్ జిల్లా కోర్టు ఈ ఆరోపణలకు ప్రాథమికంగా ఆధారాలున్నట్లు ధ్రువీకరించింది.

ప్రధాని డిగ్రీ పట్టా చూపాల్సిన అవసరం లేదు

- కేజ్రీవాల్‌కు రూ.25 వేల జరిమానా
- గుజరాత్ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన విద్యార్హతకు సంబంధించిన ఎంఎ, డిగ్రీ పత్రాలు చూపించాల్సిన అవసరం లేదని గుజరాత్ హైకోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. మోడీ ఎంఎ, డిగ్రీకి సంబంధించిన సమాచారాన్ని కేజ్రీవాల్‌కు అందజేయాలని గుజరాత్ వర్సిటీని ఆదేశిస్తూ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ (సిఐసి) 2016లో ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై గుజరాత్ వర్సిటీ హైకోర్టులో సవాలు చేసింది. ఈ పిటిషన్ విచారణలో భాగంగా సిఐసి ఉత్తర్వులను జస్టిస్ బిరేన్ వైష్ణవ్ నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ప్రధాని విద్యార్హత వివరాలను ఆర్‌టిఐ కింద కోరిన కేజ్రీవాల్ రూ.25,000 జరిమానా చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది.

ప్రధాని విద్యార్హతలు తెలుసుకునే హక్కు ప్రజలకు లేదా..? : కేజ్రీవాల్


హైకోర్టు తీర్పుపై ఓ వెబ్‌సైట్ కథనాన్ని షేర్ చేస్తూ ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.ప్రధాని ఎంతవరకు చదువుకున్నారని తెలుసుకునే హక్కు కూడా దేశానికి (ప్రజలకు) లేదా? అని ప్రశ్నించారు. "వారి డిగ్రీని చూడాలని డిమాండ్ చేసే వారికి జరిమానా విధించడం ఏంటి..?, అసలేం జరుగుతున్నది. నిరక్షరాస్యుడు, తక్కువ చదువుకున్న ప్రధాని దేశానికి చాలా ప్రమాదకరం" అని కేజ్రీవాల్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

పాక్ దేశద్రోహ చట్టం కొట్టివేత

లాహోర్ : వలసవాద కాలం నాటి దేశద్రోహ చట్టాన్ని లాహోర్ కోర్టు కొట్టివేసింది. ఈ చట్టం రాజ్యాంగానికి అనుగుణంగా లేదని పేర్కొంది. దాంతో పాకిస్తాన్ శిక్షా స్మృతిలోని 12 (4)ఎ సెక్షన్ చెల్లకుండా పోయింది. భారత్‌లో మాదిరిగానే పాకిస్తాన్‌లోనూ ఈ చట్ట మూలాలు వలసవాద కాలం నాటివి. అందువల్లే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏమాత్రం అసమ్మతి వున్నా వెంటనే వారిని శిక్షించాలని కోరుతుంది. ఈ చట్టాన్ని పాక్‌లో నిర్లక్ష్యంగా ఉపయోగిస్తున్నారని, అసమ్మతిని అణచివేయడానికి సాధనంగా వినియోగిస్తున్నారని పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. పాకిస్తాన్ రాజ్యాంగంలో 19వ అధికరణ కింద హామీ ఇచ్చిన భావ ప్రకటనా స్వేచ్ఛను కూడా అణచివేస్తున్నారని పిటిషన్లు పేర్కొన్నాయి. జస్టిస్ షాహిద్ కరీమ్ ఈ పిటిషన్లన్నింటినీ విచారించి తీర్పు ఇచ్చారని డాన్ పత్రిక పేర్కొంది. దేశ రాజ్యాంగం కింద సంక్రమించిన అనేక ప్రాథమిక హక్కులను ఈ చట్టం అవమానిస్తోందని హరూమ్ ఫరూక్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

'పరివార్' హింసాకాండ

పలు రాష్ట్రాల్లో రామనవమి ర్యాలీల్లో దాడులు, విధ్వంసం



పశ్చిమ బెంగాల్‌లోని డాల్‌ఖోలా నగరంలో దగ్ధమవుతున్న దుకాణాలు

న్యూఢిల్లీ : శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని పలు రాష్ట్రాల్లో మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టేలా ఆర్‌ఎస్‌ఎస్ గ్రూపులు హింసాకాండకు పాల్పడ్డాయి. శాంతియుతంగా నిర్వహించాల్సిన ప్రదర్శనలో డిజె సౌండ్‌తో మైనారిటీలను కించపరిచేలా నినాదాలు చేస్తూ, కత్తులు, త్రిశూలాలు ప్రదర్శిస్తూ, మసీదులు, దుకాణాలు, వాహనాలకు నిప్పు పెడుతూ, ధ్వంసం చేస్తూ, దాడులకు పాల్పడుతూ... పలు రాష్ట్రాల్లో హింసాకాండకు తెగబడ్డాయి. దేశ రాజధాని ఢిల్లీలో ముందస్తు అనుమతి లేకుండానే ర్యాలీ నిర్వ హించారు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, గుజరాత్‌లలో రాళ్ల విసరడం, గృహ, వాహన దహనాలకు పాల్పడ్డాయి. పలు ఘటనల్లో పోలీసులు, స్థానికులు, మైనారిటీలు గాయపడ్డారు. గతేడాది ఏప్రిల్‌లో హింసాకాండ నేపథ్యంలో వాయవ్య ఢిల్లీలోని జహంగీర్‌పురి ఏరియాలో ఈ ఏడాది రామ నవమి ప్రదర్శన నిర్వహించేందుకు మితవాద సంస్థ అఖిల భారత హిందూ యువమోర్చా (ఎబిహెచ్‌వైఎం) అనుమతి కోరగా, ఢిల్లీ పోలీసులు నిరాకరించారు. అయినా దాదాపు వెయ్యి మంది కాషాయ దుస్తులు ధరించి పార్కులో పూజలు చేసి, నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు అడ్డుకుని ప్రదర్శన నిలుపుచేశారు. ఈ సందర్భంగా ఎబిహెచ్‌వైఎం అధ్యక్షుడు శివం మిశ్రా మాట్లాడుతూ 'ఇది స్వేచ్ఛాదేశం, మాకు పోలీసుల అనుమతి అవసరమే ముంది?' అని అన్నారు. జహంగీర్‌పురి మసీదులో సీనియర్ మతపండి తుడు మౌలానా అబ్దుల్ కలామ్ మాట్లాడుతూ, స్థానిక పార్క్ దగ్గర ప్రార్థనలు నిర్వహించాలనుకున్నామని, పోలీసులు అనుమతించలేదని చెప్పారు. మైనారిటీలకు మాత్రమే నిబంధనలని విమర్శించారు.

ఔరంగాబాద్‌లో : మహారాష్ట్రలో రెండు ఘటనల్లో హింస చోటు చేసుకుంది. పూర్వపు ఔరంగాబాద్ అయిన శంభాజీ నగర్‌లో గురువారం తెల్లవారు జామున రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. అనేక పోలీసు వాహనాలకు నిప్పంటించారు. నగరంలోని కిరాద్‌పుర మీదుగా బైకులపై కొందరు వెళ్తూ, మైనారిటీలను రెచ్చగొట్టేలా నినాదాలు చేస్తూ, రాళ్లు రువ్వి, హింసాకాండకు పాల్పడింది. 15వాహనాలు తగలబడ్డాయి. ఈ నెల 2న ప్రతిపక్షాల ర్యాలీకి అనుమతి నిరాకరించేందుకే హింసాకాండకు బిజెపి గ్రూపులు పాల్పడ్డాయని ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన, కాంగ్రెస్, ఎన్‌సిపి విమర్శించాయి. జలగావ్‌లోనూ ఇదే రకమైన హింసకు కాషాయ మూకలు పాల్పడ్డాయి. పెద్ద పెద్దగా పాటలు పెట్టుకుని జలగావ్‌లోని మసీదు ఎదురుగా ప్రదర్శన నిర్వహించి, ఉద్రిక్తతలు రెచ్చగొట్టాయి.

మథురలో : మథురలో జామా మసీదు సమీపంలో పైకప్పుపై నుంచి కాషాయ జెండాలు ఊపుతూ, మత ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్న వీడియో వైరల్‌గా మారింది. చివరకు పోలీసు బలగాల బందోబస్తుతో కాషాయ మూకల యాత్ర ముగిసింది.

హౌరాలో : పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు గురు, శుక్రవారాల్లో హింసాకాండకు పాల్పడి, పలు వాహనాలకు నిప్పంటించాయి. డాల్‌ఖోలా తదితర ప్రాంతాల్లోను హింసాకాండకు పాల్పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం హౌరాలోని శిబ్‌పూర్‌లో ఊరేగింపునకు అనుమతించిన కొద్దిసేపటికే పోలీసుల సమక్షంలోనే మైనారిటీలపై ఆర్‌ఎస్‌ఎస్ గ్రూపు రాళ్ల దాడికి పాల్పడింది. పలు దుకాణాలకు, పోలీసు వాహనాలకు, ఇతర వాహనాలకు నిప్పుపెట్టాయి. హౌరాలో హింసాకాండ వెనుక హిందువులు లేదా ముస్లిములు ఎవరూ లేరని బెంగాల్ సిఎం మమతా బెనర్జీ చెప్పారు. బిజెపి, భజరంగ్‌దళ్, ఇతర సంస్థలు ఆయుధాలతో హింసకు పాల్పడ్డాయని విమర్శించారు.

చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- అమిత్ షాకు జాతీయ బిసి సంక్షేమ సంఘం వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి అమిత్ షాను సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, నాయకులు కలిశారు. పంచాయతీరాజ్ సంస్థలో బిసిలకు రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జన గణన బిసి కులాల గణన చేపట్టాలని కోరారు. ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు, ఇతర డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని కృష్ణయ్య తెలిపారు. కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి ఆధ్వర్యాన జంతర్ మంతర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సమితి అధ్యక్షులు జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ.. కరెన్సీ నోట్లపై బిఆర్ అంబేద్కర్ ఫొటో ముద్రించే దిశలో ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణ చేపట్టాలని కోరుతూ టిఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యాన జంతర్ మంతర్‌లో ధర్నా జరిగింది.

3న ప్రతిపక్ష పార్టీల సమావేశం

- సోషల్ జస్టిస్, ది రోడ్ ఎహెడ్ పేరుతో డిఎంకె మెగా సమావేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'సోషల్ జస్టిస్, ది రోడ్ ఎహెడ్' పేరుతో డిఎంకె అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రతిపక్ష పార్టీలతో మెగా సమావేశం ఏప్రిల్ 3న నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి 20 ప్రతిపక్ష రాజకీయ పార్టీలు హాజరుకానున్నాయి. కొంతమంది నేతలు భౌతికంగానూ, మరికొంతమంది ఆన్‌లైన్‌లోనూ పాల్గొంటారు. సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడమే 'ది ఆల్ ఇండియా ఫెడరేషన్ ఫర్ సోషల్ జస్టిస్' అనే కాన్సెప్ట్ తొలి సమావేశం ఉద్దేశమని డిఎంకె నేతలు పేర్కొన్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, బిఆర్‌ఎస్ నాయకులు కె కేశవరావు, టిఎంసి నేత డెరెక్ ఓబ్రెయిన్, ఆప్ నేత సంజయ్ సింగ్ హాజరుకానున్నారు. ఎన్‌సిపి, శివసేన (థాకరే) పార్టీల తరపున పాల్గొనే ప్రతినిధులను ఇంకా ప్రకటించలేదు. ఆహ్వానాలు పంపినప్పటికీ, వైసిపి, బిజెడి సమావేశంలో పాల్గొంటాయా? లేదా? అనే దానిపై అందరి దృష్టి ఉంది. ఇది ప్రతిపక్ష "రాజకీయ" సమావేశం కాదని, సామాజిక సమస్యలపై చర్చ అని పేర్కొన్న నేతలు, ఈ సమావేశానికి వైసిపి, బిజెడి హాజరవుతాయని అంటున్నారు. ఎంకె స్టాలిన్ కీలకాంశాలతో సమావేశాన్ని ప్రారంభిస్తారు. అన్ని పార్టీల అభిప్రాయాలను తెలియజేయడానికి సమయం కేటాయిస్తారు.

మనీష్ సిసోడియాకు బెయిల్ నిరాకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆమ్‌ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు నిరాకరించింది. సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎంకె నాగపాల్ ఈనెల 24న సిసోడియా బెయిల్ అభ్యర్థనపై తీర్పును వాయిదా వేశారు. ఆ తీర్పును శుక్రవారం వెలువరించారు. సిసోడియా రెగ్యులర్ బెయిల్ అప్లికేషన్‌ను వ్యతిరేకిస్తూ సిబిఐ లిఖిత పూర్వకమైన వివరాలు కోర్టుకు తెలియజేసిందని, కాపీ ప్రతిని సిసోడియా న్యాయవాదికి ఇస్తామని, కేసు డైరీ, సాక్షుల వివరాల కాపీని కూడా అందుబాటులో ఉంచుతామని ప్రత్యేక న్యాయమూర్తి తెలిపారు. సిసోడియాను ఇంతవరకూ ఏడు రోజుల పాటు సిబిఐ ప్రశ్నించింది. ఫిబ్రవరి 26న అరెస్టు చేసింది.

35కు చేరిన ఇండోర్ మెట్లబావి మరణాలు

ఇండోర్: మధ్యప్రదేశ్ రాజధాని ఇండోర్‌లో మెట్లబావి పైకప్పు కూలిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 35కు పెరిగింది. పటేల్ నగర్‌లోని బలేశ్వర్ మహదేవ్ జులేలాల్ గుడిలో ఆలయంలో ఉన్న మెట్ల బావి పైకప్పు ఒక్కసారిగా కూలడంతో దానిపై కూర్చున్న దాదాపు 50 మంది అందులో పడిపోయారు. వారిలో 35 మంది చనిపోయారు. మరో 18 మంది గాయపడి చికిత్స పొందుతున్నారని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు. 19 మందిని ప్రమాదం నుంచి రక్షించారు. ఆలయంలో గురువారం శ్రీరామనవమి ఉత్సవాలను చూసేందుకు వచ్చిన వారు మెట్ల బావిపై కూర్చుని ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే.

కార్మిక హక్కులపై దాడికి వ్యతిరేకంగా

28న రక్షణ రంగ ఉద్యోగుల అఖిల భారత నిరసన దినం

- ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



రక్షణ పరిశ్రమలో ట్రేడ్ యూనియన్ హక్కులు, కార్మికుల హక్కులపై పెరుగుతున్న దాడికి వ్యతిరేకంగా ఏప్రిల్ 28న అఖిల భారత నిరసన దినంగా పాటించాలని ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎఐడిఈఎఫ్) పిలుపునిచ్చింది. ఎఐడిఇఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం మార్చి 29, 30 తేదీల్లో తమిళనాడులోని అరువంకాడులో జరిగింది. ఈ సందర్భంగా ఎఐడిఇఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఎస్.ఎన్ పథాక్ అధ్యక్షతన జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది. రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న నాలుగు లక్షల మంది డిఫెన్స్ సివిలియన్ ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారని తెలిపింది. ఇప్పటికే 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు కార్పొరేటీకరించారని, ఇప్పుడు ఎంఇఎస్ కార్పొరేటీకరణ గురించి రక్షణ మంత్రిత్వ శాఖలో చర్చ జరుగుతోందని తెలిపింది. డిఆర్‌డిఒ, నేవీ, ఇతర ఎస్టాబ్లిష్‌మెంట్‌లలో పెద్ద ఎత్తున అవుట్‌సోర్సింగ్ జరుగుతోందని పేర్కొంది. డిఆర్‌డిఒ ప్రాజెక్టులను ప్రైవేట్ రంగానికి అప్పగిస్తున్నారు. డిజిక్యూఎని తగ్గించేందుకు జాతీయ ఉత్పాదక మండలి నివేదికను అమలుచేయాలనే ప్రతిపాదన రక్షణ మంత్రిత్వ శాఖ పరిశీలనలో ఉంది. డిజిక్యూఎను తగ్గించడం వల్ల రక్షణ మంత్రిత్వ శాఖలో ఖాళీగా ఉన్న 20.90 లక్షల పోస్టులను భర్తీ చేయలేదు. ముంబయిలోని సెంట్రల్ ఆర్డినెన్స్ డిపోతో సహ వివిధ ఆర్డినెన్స్ డిపోలు మూతపడనున్నా యని తెలిపింది. ప్రభుత్వం వాటాదారులు (గుర్తింపు పొందిన డిఫెన్స్ సివిలియన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్)లతో ఎలాంటి చర్చలు జరపకుండానే ఈ నిర్ణయాలన్నింటితో మోడీ సర్కార్ ముందుకెళ్తుందని విమర్శించింది. ఎఐడిఇఎఫ్ సహ ఫెడరేషన్‌ల ప్రాతినిధ్యాలను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, ఆర్మీ వర్క్‌షాప్‌లలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు జరగలేదు.

కేంద్రం నిర్లక్ష్యం : సి.శ్రీకుమార్, ఎఐడిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి

ఎఐడిఈఎఫ్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం కార్మిక సంఘాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, శ్రామికశక్తికి ప్రాతినిధ్యం వహించే కార్మిక సంఘాలు రాజ్యాంగబద్ధమైన సంస్థలేనన్న వాస్తవాన్ని నిరాకరిస్తున్నారని అన్నారు. ఇండియా ఐఎల్‌ఒ వ్యవస్థాపక సభ్య దేశమని తెలిపారు. ఐఎల్‌ఒ ప్రకారం కార్మికులకు సంబంధించిన సమస్యలను చర్చించడానికి, క్రమబద్ధీకరించడానికి అన్ని సభ్య దేశాలు ప్రతి సంవత్సరం తమ లేబర్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేయాలని, అయితే ప్రస్తుత ప్రభుత్వం 2015 తరువాత ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. కార్మిక చట్టాలను తారుమారు చేసి, కార్మిక సంఘాల అభిప్రాయాలను విస్మరిస్తూ కార్పొరేట్ అనుకూల లేబర్ కోడ్‌లుగా మారుస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, ఫిర్యాదులను చర్చించి పరిష్కరించేందుకు 1966లో ఏర్పాటైన జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ (జెసిఎం) నిర్వీర్యమైందని పేర్కొన్నారు. జెసిఎంలో ఉద్యోగుల తరపున తాను ప్రాతినిధ్యం వహించినప్పటికీ కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ జెసిఎం సమావేశాన్ని నిర్వహించలేదని విమర్శించారు.

పోరాటమే మార్గం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ నాయకులు జడ శ్రావణ్ కుమార్, దళిత బహుజన జెఎసి నాయకులు పోతుల బాలకోటయ్య, కృష్ణా జిల్లా పరిషత్తు మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, టిడిపి మహిళా విభాగం అధికార ప్రతినిధి కంభంపాటి శిరీష పాల్గొన్నారు.

బిజెపి, వైసిపియే కారణం : సిపిఎం

రాజధాని అమరావతి ప్రస్తుత దుస్థితికి బిజెపి, వైసిపియే కారణమని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు విమర్శించారు. రాజధాని 1200వ రోజు దీక్షకు మద్దతుగా ఆయన మాట్లాడుతూ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంలో 'నేనెక్కడకు వెళతాను. అమరావతిలోనే ఇంద్ర భవనంలాంటి ఇల్లు కట్టుకున్నాను. వైసిపి కేంద్ర కార్యాలయం కూడా అమరావతిలోనే ఉంది. రాజధాని కూడా ఇక్కడే ఉంటుంది' అని చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గెలిచాక మాట మార్చారని అన్నారు. రూ.42 వేల కోట్లతో ఢిల్లీని తలదన్నే రీతిలో రాజధానిని నిరిస్తామని 2014లో హామీ ఇచ్చిన బిజెపి... అమరావతి రాజధాని నిర్మాణానికి రూ1,500 కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. 42 కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణాల కోసం రైతుల భూములను కేటాయిస్తే, వాటిలో ఇప్పటివరకూ ఎన్ని నిర్మాణాలను పూర్తి చేసిందో కేంద్రంలోని బిజెపి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణానికి ఎన్ని నిధులు కేటాయించిందో, విభజన చట్టం ప్రకారం ఏమి చేసిందో చెప్పాలని నిలదీశారు. వైసిపి, టిడిపి రోజూ తిట్టుకుంటూ రాష్ట్రపతి ఎన్నికల్లో మాత్రం ఈ రెండు పార్టీలూ కలిసి బిజెపికి ఓటు వేశాయని గుర్తు చేశారు. రాజధానిగా అమరావతినే కొనసాగించాలని, రైతులకు కౌలు సక్రమంగా చెల్లించాలని, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులు, పేదలకు అమరావతి పింఛను రూ.5 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని నిర్మాణానికి సిపిఎం కట్టుబడి ఉందని, రైతుల ఉద్యమానికి అండగా ఉంటుందని అన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి పాల్గొన్నారు.

నేటి నుంచి మండనున్న మందుల ధరలు

- 384 ఔషధాల ధరలు 12.12 శాతం పెంపు
- మోడీ హయాంలో ఏటా భారీ పెరుగుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహంతో సహ నిత్యం వాడే మందుల ధరలు శనివారం నుంచి భారీగా పెరగనున్నాయి. 27 రకాల చికిత్సలకు సంబంధించిన 384 నిత్యావసర ఔషధాలు, వెయ్యి కంటే ఎక్కువ ఫార్ములేషన్స్ ధరలను 12.12 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది 10.7 శాతం ధరలు పెంచారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) స్థూల ధరల సూచీ పెరుగుదల ఆధారంగా అవసరమైన ఔషధాల ధరలను పెంచడానికి తయారీదారులను అనుమతించి ంది. జ్వరం మందులు (పారాసిటమాల్ వంటివి), యాంటి బయోటిక్స్ (అజిత్రోమైసిన్ వంటివి), అంటువ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు, రక్తపోటు (బిపి), డయాబెటిస్ (షుగర్), చర్మవ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు, రక్తహీనత (ఫోలిక్ యాసిడ్ వంటి ఔషధాలు), రక్తప్రసరణ సంబంధిత జబ్బులు, క్షయ (టిబి), వివిధ రకాల క్యాన్సర్లు వంటి వాటి మందులతోపాటు మినరల్, విటమిన్ మాత్రలు, పెయిన్ కిల్లర్లు, యాంటీబయాటిక్స్, యాంటీ ఇన్ఫెక్టివ్స్ ధరలు పెరగనున్నాయి. అవసరమైన మందుల జాబితాలో లేని మందులపై వార్షిక ధరలను 10 శాతం పెంచడాన్ని కమిటీ ఆమోదించింది.

మోడీ హయాంలో భారీగా పెరుగుతున్న ధరలు

నిత్యావసర మందులకు 12 శాతం పెంపును అనుమతించడం ఇదే తొలిసారి. నాన్-షెడ్యూల్డ్ డ్రగ్స్‌కు అనుమతించిన దానికంటే ఎక్కువ పెంచడం ఇది వరుసగా రెండో సంవత్సరం. 2013లో ఔషధ ధరల నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత, ప్రతి సంవత్సరం మందుల ధరలను సవరిస్తూ వచ్చిన తరువాత ఇంత భారీ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. అంతకు ముందు ప్రతి మూడేళ్లకు ఒకసారి ధరల పెంపు ఉండేది. ధరల పెంపునకు ముందు, అవసరమైన మందుల జాబితాను సిద్ధం చేసే స్టాండింగ్ కమిటీ, 34 కొత్త మందులు, 26 మందులను మినహాయించి 384 మందుల జాబితాను విడుదల చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న మందులను ఎంఆర్‌పిలో ఉన్న ధరలకే విక్రయించాల్సి ఉంటుంది. కొత్త స్టాక్ వచ్చినప్పుడు ధరలు మారుతాయి.

వినియోగదారులపై భారీ భారం

ఔషధాల ధరలు గతేడాది కంటే ఇప్పటికే 20 శాతం పెరిగాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 12 నెలల్లో ప్రతి 10 మంది వినియోగదారుల్లో ఆరుగురు ఔషధాల ధరల్లో 20 శాతం పెరుగుదలను అనుభవించారని, మధుమేహం, రక్తపోటు, కీళ్లనొప్పులు, క్యాన్సర్‌కు సంబంధించిన ప్రత్యేక ఔషధాల ధరలు ఎక్కువగా పెరిగాయని ఒక సర్వేలో తేలింది. కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో 58 శాతం మంది వినియోగదారులు సాధారణంగా ఉపయోగించే మందులు ఎంఆర్‌పి కంటే పెరిగినట్లు తెలిపారని తేలింది. మెజారిటీ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం ఔషధాలపై వంద శాతానికిపైగా ఉన్న ట్రేడ్ మార్జిన్లను భారీగా తగ్గించాలని కోరుకుంటున్నారని స్పష్టమైంది.

ఎంసెట్ పరీక్ష తేదీల్లో మార్పు

- మే 12 నుంచి 14 ఇంజినీరింగ్ విభాగం
- పాత తేదీల్లోనే అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బిఎస్‌సి నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్ రాతపరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. మే ఏడు నుంచి 11వ తేదీ వరకు జరగాల్సిన ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షల తేదీలు మారాయి. మే 12,13,14 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే ఏడో తేదీన నీట్ (యూజీ) పరీక్ష ఉంటుందంటూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ప్రకటించిందని, మే ఏడు, ఎనిమిది, తొమ్మిది తేదీల్లో టిఎస్‌పిఎస్‌సి పరీక్షలను నిర్వహిస్తుండడంతో ఈ మార్పులు చేశామని వివరించారు. వాటిని దృష్టిలో ఉంచుకుని ఎంసెట్‌కు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఇంజినీరింగ్ విభాగం షెడ్యూల్‌ను సవరించామని తెలిపారు. అయితే ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు చేయలేదనీ, మే 10,11న పాత తేదీల్లోనే యథాతథంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంసెట్ దరఖాస్తుల గడువు ఈనెల పదో తేదీ వరకు ఉన్నది. ఆలస్య రుసుముతో వచ్చేనెల రెండో తేదీ వరకు అవకాశమున్నది. ఈనెల 30వ తేదీ నుంచి ఎంసెట్‌కు దరఖాస్తు చేసిన అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఎంసెట్‌కు 1.92 లక్షల దరఖాస్తులు

శుక్రవారం నాటికి 1,80,240 దరఖాస్తులొచ్చాయని ఎంసెట్ కన్వీనర్ డీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 1,23,129 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 69,233 మంది, ఆ రెండింటికీ 223 మంది దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ పదో తేదీ వరకు ఉంది.

అధిక విమాన ఛార్జీలను నియంత్రించాలి

- ప్రధాని మోడీకి కేరళ సిఎం పినరయి విజయన్ లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రద్దీ సమయాల్లో విమాన సంస్థలు భారీగా ఛార్జీలు వసూలు చేస్తున్నాయని, వాటిని నియంత్రించాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజయన్ లేఖ రాశారు. రద్దీ సమయాల్లో అధిక ఛార్జీలను అరికట్టేందుకు విమానయాన సంస్థలతో చర్చలు జరపాలని కోరారు. గల్ఫ్ దేశాల నుంచి కేరళకు వచ్చే ఛార్జీలు రెండు నెలల్లో మూడు రెట్లు పెరిగాయని, పండుగలు, పాఠశాల సెలవులు వంటి సందర్భాల్లో పెంపు సాధారణ ప్రయాణికులకు చాలా భారంగా ఉంటుందని తెలిపారు. నెలల తరబడి శ్రమించి పొదుపు చేసుకున్న కొద్దిపాటి సొమ్మును టిక్కెట్టుకే వెచ్చించాల్సి వస్తోందని, ఛార్జీలను సవరించాలని కేరళ ప్రభుత్వం, ప్రవాస సంస్థలు చేసిన అభ్యర్థనలపై విమానయాన సంస్థలు ఇప్పటివరకూ సానుకూలంగా స్పందించలేదని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లోని అల్పాదాయ కార్మికులకు పండుగలు, సెలవు దినాల్లో సరసమైన ధరలకు ప్రత్యేక సేవలు అందించాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఏప్రిల్ రెండో వారం నుంచి కేరళ ప్రభుత్వం బుక్ చేసిన అదనపు, చార్టర్ విమాన ఆపరేషన్లకు అవసరమైన అనుమతులను త్వరగా ఇవ్వాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖను ఆదేశించాలని లేఖలో డిమాండ్ చేశారు.

నోడల్ ఏజెన్సీ టు వెండార్

- ఎంపి నిధుల విడుదలలో మార్పులు, నేటి నుంచి అమలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఎంపి నిధుల విడుదల విధానంలో స్వల్ప మార్పులు జరిగాయి. మారిన విధానాలు 2023 ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వస్తాయని ఎంఒఎస్‌పిఐ (మినిస్ట్రీ ఆఫ్ స్టేటస్టిక్స్ ప్లానింగ్ ఇంప్లిమెంటేషన్) విభాగం స్పష్టం చేసింది. దేశంలోని ప్రతి ఎంపికి ఏటా రూ.5 కోట్ల చొప్పున నిధులు రెండు దఫాలుగా కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తోంది. వీటి వినియోగానికి సంబంధించి ఇప్పటి వరకు ఉన్న విధానం ప్రకారం... ఎంపిలు తన లెటర్ ప్యాడ్‌పై ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపు తున్నారు. నిబంధనలకు లోబడి ఉన్న వాటికి కలెక్టర్ పరిపాలనా అనుమతులు ఇస్తున్నారు. పని స్వభావాన్ని, అవకాశాన్ని బట్టి ఏదో ఒక ఇంజనీరింగ్ శాఖకు ఎగ్జిక్యూటివ్ బాధ్యతలు అప్పగిస్తున్నారు. చేపట్టిన పనుల విలువలో 50 శాతం నిధులు ముందస్తుగా, మిగిలిన 50 శాతం నిధులు పని పూర్తయిన తర్వాత వెండార్‌కు చెల్లించేవారు. ఈ నిధులన్నీ నేషనల్ నోడల్ ఏజెన్సీ నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలోగల ఎంపి నిధుల ఖాతాకు వచ్చేవి. అక్కడి నుంచి ఆన్‌లైన్ లేదా చెక్కు రూపంలో వెండార్‌కు వెళ్లేవి. తాజాగా ఈ నిబంధనల్లో స్వల్ప మార్పు చేస్తూ ఎంఒఎస్‌పిఐ నిర్ణయం చేసింది. దేశంలోని ఎంపిలంతా తమ లెటర్ ప్యాడ్‌పై కాకుండా నేరుగా ఆన్‌లైన్‌లో కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలి.ప్రతి ఎంపికీ ప్రత్యేక లాగిన్ కేటాయిస్తారు. మునుపటి మాదిరిగానే నిబంధనలకు లోబడి కలెక్టర్లు పరిపాలనా అనుమతులు ఇస్తారు. అయితే, అడ్వాన్సు చెల్లింపు విధానాన్ని రద్దు చేసింది. పూర్తయిన పనులకు రెండు దఫాలుగా బిల్లుల చెల్లింపు జరగనుంది. ఇవి ఇంతకుముందు మాదిరిగా కలెక్టర్ పరిధిలోని ఎంపి ల్యాడ్స్ అకౌంట్లతో సంబంధం లేకుండా నేరుగా వెండార్ ఖాతాల్లోనే జమ అవుతాయి. పని విషయంలో కలెక్టర్ నియమించిన ఇంజనీరింగ్ శాఖాధికారులు యథాతథంగా పర్యవేక్షిస్తారు. మారిన నిబంధనలు కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి అమల్లోకి రానున్నట్టు మార్చి 28న జరిగిన వెబెక్స్ సమావేశంలో మినిస్ట్రీ ఆఫ్ స్టేటస్టిక్స్ ప్లానింగ్ ఇంప్లిమింటేషన్ కమిషనర్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. ఇప్పటికే ఢిల్లీ, బెంగళూరు కేంద్రంగా సిపిఒలు, ప్రణాళిక శాఖ జాయింట్ డైరెక్టర్లకు రెండు దఫాలు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపిలు, అధికారుల సూచన మేరకు మెయింటినెన్స్, మరమ్మతు పనులకు ఎంపి నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలనలోకి తీసుకున్నట్టు సమాచారం.

14 నుండి ప్రచార భేరి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. రాష్ట్రంలోనూ అదానీకి పోర్టులు, రోడ్లు, రైల్వే, మైనింగ్ అప్పగించేందుకు సిఎం జగన్ తాపత్రయపడుతున్నారని అన్నారు. రాష్ట్రానికి బిజెపి తీవ్ర అన్యాయం చేసిందని, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు దాన్ని ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టారని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వబోమని కేంద్రం చెబుతోందని ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని పేర్కొన్నారు. రాజధాని కోసం 1200 రోజులుగా ఉద్యమం జరుగుతున్నా అమరావతి రాజధాని అని కేంద్రం ప్రకటించకపోగా గోడమీద పిల్లిలా వ్యవహరిస్తోందని తెలిపారు. పోలవరంలో వేల కుటుంబాలు మునిగిపోతుంటే పునరావాస నిధులు ఇవ్వడం లేదన్నారు. పునరావాసం పూర్తికాకకుండా ప్రాజెక్టు ఎలా పూర్తవుతుందని, ఒకవేళ పూర్తి చేయడం అంటే నిర్వాసితులను ముంచేయడమేనని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అదానీకి కట్టబెట్టేందుకు చూస్తున్నారని తెలిపారు. 100 సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగిన జగన్ ఒక్కసారి కూడా ఉక్కు ఫ్యాక్టరీ గురించి మాట్లాడలేదని పేర్కొన్నారు. గ్యాస్, పెట్రోలు, విద్యుత్ ఛార్జీలు, ఆస్తి, చెత్తపన్ను భారాలు ప్రజలపై మోపారని అన్నారు. దీన్ని ప్రతిఘటించాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉందని తెలిపారు. బిజెపి మతోన్మాదంపై వైసిపి, టిడిపి, జనసేన నాయకులు నోరెత్తడం లేదని, మోడీని చూసి భయపడుతున్నారా అని ప్రశ్నించారు. అవినీతిపై అన్ని ప్రతిపక్షాలు పార్లమెంటులో పోరాడుతుంటే వైసిపి, టిడిపి ఎంపిలు చేతులు కట్టుకు కూర్చున్నారని, ఇది రాష్ట్రానికి అవమానమని అన్నారు. దీనిపై ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం తన బాధ్యత నెరవేర్చకపోతే చరిత్ర క్షమించదని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ మోడీ పార్లమెంటుకు విలువ లేకుండా చేస్తున్నారని తెలిపారు. అదానీ కుంభకోణంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని, పార్లమెంటులో చర్చించాలని ప్రతిపక్షాలు కోరుతుంటే 20 రోజులుగా సభ సజావుగా జరగకుండా అసలు సమావేశాలే నిర్వహించకుండా కుట్ర చేస్తోందని తెలిపారు. క్రోనీ క్యాపిటలిజంతో మోడీ ప్రాపకంతో అధికారాన్ని ఉపయోగించుకుని అదానీ డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి దోచుకుంటుంటే జెపిసి వేయడానికి ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల నరేంద్రమోడీ పరిపాలనలో ధరలు తగ్గలేదని, ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయలేదని, బ్లాక్‌మనీని వెనక్కు తెప్పించలేదని, అవినీతి పెరుగుతోందని, కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రశ్నించిన వారిపై ఇడి, సిబిఐ కేసులు నమోదు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ కేంద్రానికి పూర్తిస్థాయిలో లొంగుబాటు ప్రదర్శిస్తున్నారని తెలిపారు. అదానీ అక్రమాలపై విమర్శలు ఎదుర్కొంటున్న సమయంలోనే క్యాబినెట్ పెట్టి వేలకోట్ల విలువైన భూమలను కట్టబెట్టారని తెలిపారు. అదానీ, మోడీ, జగన్ మధ్య ప్రత్యేక సంబంధం నడుస్తోందని తెలిపారు. దీనిపై ప్రజలను చైతన్యం చేయడానికి కలిసి వచ్చే ఇతరులను కలుపుకుని వెళతామన్నారు. ప్రజాస్వామ్య వాదులు, వామపక్షాలు, అన్యాయాన్ని ప్రశ్నించేవారందరూ ఉమ్మడిగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.




మీకోసం

పగిలిన గుడ్లను వెనిగర్ కలిపిన నీళ్లలో ఉడకబెడితే లోపలి ద్రవం బయటకు రాకుండా ఉంటుంది.

జీవన సౌరభం

ఇష్టమైన పని చేస్తూ వుంటే అలసట రానే రాదు.

తాబేలు తెలివి



ఒక చెరువులో తాబేలు, మొసలి, ఓ చేప స్నేహంగా ఉండేవి. తాబేలు చెరువు నుంచి బయటికి వచ్చి అడవిలో తిరిగేది. బయటి విషయాలు మొసలి, చేపలకు చెప్పేది. తాబేలు చెరువు బయట ఉండే జీవులతో కూడా స్నేహం ఉండేది.

ఒకరోజు తాబేలు చెరువు బయటకి వచ్చి నెమ్మదిగా నడుచుకుంటూ అడవిలోకి వెళ్ళింది. దారిలో ఒక కోతి కనిపించింది. 'మిత్రమా! మా చెట్టుమీద కొత్తగా ఒక కొంగ వచ్చి గూడు కట్టుకుంది. అది చాలా దచీశీఅవఁచెడ్డది. నోటినిండా అబద్దాలే! చెట్టు మీది జీవులను నమ్మించి మోసం చేస్తుంది. దానికి ఎలా బుద్ధి చెప్పాలో తెలియడం లేదు.' అని విచారంగా కోతి.

'బాధపడకు. అది చెరువుకు వచ్చినప్పుడు గమనిస్తాను. నీ సమస్య తీరుస్తాను' అభయం ఇచ్చింది తాబేలు. చెరువుకు వెళ్లి ఈ విషయాన్ని మొసలి, చేపలకు చెప్పింది.

మరుసటి రోజు ఉదయాన్నే ఆ కొంగ చెరువుకు వచ్చింది. నీటిని తాగి, వెళ్లి ఒడ్డున ఒంటి కాలుపై నిలబడింది. కొంగను గమనించిన తాబేలు 'ఎందుకు నువ్వు ఒంటి కాలిపై నిలుచున్నావూ? ' అనడిగింది.

'నేను ఇంతకాలం జీవుల్ని చంపి తిని పాపం మూట కట్టుకున్నాను. ఇప్పుడు శాకాహారిగా మారిపోయాను. అందుకే ఒంటి కాలిపై ధ్యానం చేస్తున్నా' అంది కొంగ. దాంతో తపస్సు చేస్తున్న కొంగని చూడటానికి చేపలు, బాతులు, నత్తలు, ఎండ్రకాయలతో పాటు మొసలి వచ్చాయి. కొంగకు నమస్కరించి వెళ్లసాగాయి.

అప్పటివరకూ కళ్లు మూసి తపస్సు చేసిన కొంగ కళ్ళు తెరిచి, ఎవరూ చూడని సమయం చూసి ఎదురుగా ఉన్న జీవులను పట్టుకొని గుటుక్కున మింగసాగింది. తాబేలు గమనించి ఈ విషయాన్ని మొసలికి చెప్పింది. కొంగకు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాయి. కొన్ని పండ్లని డిప్పలో వేసుకుని కొంగ వద్దకు వెళ్లాయి.


'మీరు ఉదయం నుంచి ఆహారం ఏమీ తీసుకోలేదు. మీ కోసం పండ్లు తీసుకొచ్చాను. స్వీకరించండి!' అంటూ కొంగకు పండ్ల డిప్ప ఇచ్చింది.

కొంగ చిరునవ్వుతో పండ్లను స్వీకరించింది. పండ్లు తింటూ ఉండగా మొసలి కొంగను పట్టుకొని గుటుక్కున మింగేసింది.

'అడవిలో ఒక జీవి మరో జీవి ఆకలి తీర్చుకోవటానికి చంపుకు తినటం సహజమే. కానీ ఇతరులను నమ్మించి మోసం చేయటం అనేది తప్పు.' అందుకే కొంగకు తగినశాస్తి జరిగిందను కున్నాయి మిగిలిన జీవులన్నీ.

– పైడిమర్రి రామకృష్ణ
92475 64699

లెక్క తేల్చండి



చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 150

నేను గీసిన బొమ్మ





- సి. గురవమ్మ, 5వ తరగతి, పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల, తొట్టంబేడు మండలం, తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అద్భుతాలు సాధించడంతో ఆగిపోకూడదు ..



పర్వతాలు అధిరోహించేందుకు చాలామంది ఉత్సాహపడతారు. ఆర్థికంగా కష్టమైనా అప్పులు చేసి మరీ పర్వతారోహణ చేసిన వారి గురించి చాలాసార్లు విన్నాం. ఇప్పుడు మనం చెప్పకుంటున్న ముగ్గురు మహిళలకు కూడా పర్వతారోహణ అంటే చాలా ఇష్టం. ఆ ఆసక్తితో అనేకసార్లు పర్వతారోహణ చేశారు. ఇందులో ప్రత్యేకత ఏముంది అనుకుంటున్నారా? అయితే వారు తమ ఆసక్తిని మరికొంతమందికి చేరువ చేస్తున్నారు. పురుషులు అధికంగా ఉన్న పర్వతారోహణ మార్గదర్శక రంగంలో భాగస్వామ్యమై ఎంతోమంది మహిళలను, పిల్లలను, ప్రత్యేక అవసరాలు కలిగిన వారితో ట్రెక్కింగ్ చేయిస్తున్నారు. అలా ఇప్పటివరకు 8 ఏళ్లలో 5 వందల ట్రిప్‌లు వేశారు. ఇంతటి సాహసయాత్ర చేస్తున్న ఆ మహిళలు అనూషా సుబ్రమణియన్, శశి బహుగుణ, గునీత్ పూరీ.



హిమాలయాల అంచుల వరకు వెళ్లడం, అక్కడక్కడ పచ్చని మొక్కల కనువిందు, క్షణకాలంలో మారిపోయే వాతావరణ పరిస్థితి, భూమికి వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం, చుట్టూ చల్లని వాతావరణంలో అస్తమయ సూర్యకిరణాల వేడిని కూడా అద్భుతంగా భావించడం వంటి అనేక అనుభూతులు ఎన్నోసార్లు ఒకరికొకరు పంచుకున్న ఈ ముగ్గురు మహిళలు ఒక్కప్రదేశం వారు కాదు. ముంబయిలో ఉండే అనూష స్వతంత్ర జర్నలిస్టు. డూన్‌లో నివసించే శశి మాజీ బ్యాంకు అధికారి. రుద్రపూర్‌లో ఉండే గునీత్ మాజీ సంపాదకురాలు. వీరంతా వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా సోషల్ మీడియా ద్వారా తమ ట్రెక్కింగ్ విశేషాలను షేర్ చేసుకునేవారు. ఆ చర్చల్లోనే ముగ్గురు కలసి ఓ స్వతంత్ర ట్రెక్కింగ్ సంస్థను ఏర్పాటు చేయాలన్న ఆలోచనకు వచ్చారు. అలా 2014 డిసెంబరులో 'ద బొహెమైన్ అడ్వెంచర్స్' పేరుతో ఓ స్టార్టప్‌ను ప్రారంభించారు.

'అద్భుతాలను సాధించాలనుకున్నవారు ఎప్పటికీ ఆగిపోకూడదు. అందుకే మా ట్రెక్కింగ్ ట్రిప్‌ల్లో ప్రముఖంగా సీనియర్ సిటిజన్స్, మహిళలు, వైకల్యంతో బాధపడేవారిని భాగస్వామ్యం చేస్తాం' అంటున్నారు అనూష.

మొదటి అడుగు..

అనూషకు ఏడేళ్లప్పుడు ముంబయికి దగ్గర్లోని పర్వత ప్రాంతమైన మాథెరన్‌కు మొట్టమొదటి ట్రెక్ చేసింది. 'ఆ అనుభూతిని నేను ఇప్పటికీ మర్చిపోలేను. 2008లో ఉద్యోగంలో పూర్తి సమయం గడుపుతున్నప్పుడు కూడా ట్రెక్కింగ్ చేసేదాన్ని. ఉత్తర కాశీ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటైనీరింగ్‌లో అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో డిగ్రీ పట్టా తీసుకున్నాను. అక్కడే గునీత్‌ను కలిశాను. ఆ తరువాత నా జీవితం పూర్తిగా మారిపోయింది. 2012లో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలిపెట్టేశాను. గునీత్‌తో కలిసి 2013లో ఉత్తరాఖండ్‌లో సంభవించిన వరద ప్రమాదంలో రెస్క్యూ ఆపరేషన్ చేశాను' అంటూ గతాన్ని గుర్తు చేసుకున్నారు అనూష.

బొహెమైన్ అడ్వెంచర్ స్థాపించడంలో ముఖ్య ఉద్దేశం గురించి చెబుతూ 'ట్రెక్కింగ్ అనుభూతి మా ఒక్కరికే కాకుండా



మరింతమందికి చేరువ చేయాలన్న మా ఇద్దరి ఆలోచనకు మా ఫేస్ బుక్ స్నేహితురాలు శశి కూడా కలిసింది. ఒకసారి నేను ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేస్తున్నప్పుడు ఆ ప్రాజెక్టులో భాగంగా చాలామంది వ్యక్తులను కలిశాను. వారిలో చూపు కోల్పోయిన ఒకతను తనకు పారాగ్లైడింగ్, ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టమని చెప్పాడు. ట్రెక్కింగ్ ట్రిప్ ఆలోచన వచ్చినప్పుడు నాకు ఆనాటి సంఘటన గుర్తొచ్చింది. వెంటనే అటువంటి ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని కూడా భాగస్వామ్యం చేద్దాం అన్నాను. ఆ ఆలోచనను నా స్నేహితులు చాలా సంతోషంగా ఒప్పుకున్నారు' అంటున్న అనూష తన మిత్ర ద్వయంతో కలసి చూపుకోల్పోయిన ఓ ముగ్గురు వ్యక్తులు, ఓ పదిమంది సాధారణ సభ్యులతో ఓ బృందాన్ని తయారుచేసి 2018లో కిలీమంజారో ట్రెక్కింగ్ ట్రిప్ నిర్వహించారు.

ఈ ఏప్రిల్‌కు మరో బృందం

ఆ ట్రిప్ ఇచ్చిన ఉత్సాహంతో ఆ తరువాత అనేక ట్రెక్కింగ్ బృందాల్లో కేవలం చూపు కోల్పోయిన వ్యక్తులే కాక ఆటిజమ్‌తో బాధపడే పిల్లలు, పెద్దలను కూడా భాగస్వామ్యం చేస్తున్నారు. ఈ ఏప్రిల్‌లో పార్కిన్‌సన్‌తో బాధపడుతున్న వ్యక్తితో మరో ట్రెక్కింగ్ ట్రిప్ సిద్ధంగా ఉంది.

నిరుత్సాహపర్చకుండా..

ఆస్తమా వంటి ఆరోగ్య సమస్యలున్న వారు కూడా ట్రెక్కింగ్ చేయాలన్న ఆసక్తితో ఈ బృందాన్ని సంప్రదిస్తున్నారు. అయితే వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, అందులో వారి శక్తిసామర్థ్యాలు తెలిసిన తరువాతే ట్రెక్కింగ్‌లో భాగస్వామ్యం చేస్తున్నారు. అంతేకాదు, వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి వారిని నిరుత్సాహ పర్చకుండా ఏ ప్రాంతాలకు ట్రెక్కింగ్ చేయడం మంచిదో కూడా చెబుతున్నారు.

'ట్రెక్కింగ్ ట్రిప్ నిర్వహించే వారిలో ఎక్కువమంది పురుషులే ఉన్నారు. ఆ వివక్షను మేం ఛేదించాం. మా ట్రిప్స్‌లో సగానికి పైగా మహిళలే ఉంటారు. వారిలో 40 నుండి 50 ఏళ్లు దాటిన వారే ఎక్కువ. పిల్లలు, పెద్దలతో కలసి హేమకుండ్ సాహెబ్, మౌంట్ రుద్రగయ, దయరా బుగ్యల్, మౌంట్ థెలు, స్టాక్ కంగ్రి, నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్, సందన్ వ్యాలీ, మౌంట్ కిలిమంజారో వంటి అనేక ప్రదేశాలకు ఇప్పటివరకు 500 ట్రిప్‌లు వేశాం. పురుషాధిక్యత వున్న ఈ రంగంలో మేం ఇంత విజయవంతంగా ప్రయాణిస్తున్నామంటే ఎన్నో అవరోధాలు ఎదుర్కొన్నాం. మొదట్లో ప్రజలు మమ్మల్ని నమ్మలేదు. అందుకే మున్ముందు ఈ వృత్తిలో మరింత మంది మహిళలు ట్రెక్కింగ్ మార్గదర్శకులుగా రావాలి. ఆసక్తి వున్న వారికి అవసరమైన ప్రోత్సాహం ఇవ్వాలి. పర్వతాలు వివక్ష చూపవు.. మరి మనలో ఎందుకు వివక్ష..' అంటున్నారు ఈ స్నేహితుల త్రయం.



'ఎన్‌బీకే -108' బాలకృష్ణ న్యూ లుక్

అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ నటిస్తున్న చిత్రం 'ఎన్‌బీకే 108' రెగ్యులర్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దసరా బరిలో సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు. షైన్ స్క్రీన్ సంస్థ నిర్మిస్తోన్న ఈ చిత్రం నుంచి తాజాగా ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ తెలంగాణ యాసలో మాట్లాడనున్నారని తెలుస్తోంది. కాజల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కీలక పాత్ర పోషిస్తున్నారు. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

నేను సినిమాల్లోకి వస్తానంటే వాళ్లు ఒప్పుకోలేదు..



'**ఈ** రోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు నా తల్లిదండ్రులకు ధన్యవాదాలు చెప్పాలి. సినిమా పరిశ్రమ, ఇక్కడి వాతావరణంపై వాళ్లకు ఎన్నో భయాలు ఉన్నాయి. దాంతో నేను పరిశ్రమలోకి వస్తానంటే మొదట్లో అంగీకరించలేదు. ఆ తర్వాత వాళ్లకు నా ఇష్టం అర్థమైంది. టీవీ సీరియల్స్‌లో మంచి పాత్రలు పోషించి, అనంతరం మరాఠీ సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చాను. నేను పోషించే పాత్రల పట్ల ఇంట్లో వాళ్లు సంతోషంగా ఉన్నారు. నా విషయంలో గర్వపడుతున్నారు' అని అంటున్నారు మృణాళినీ ఠాకూర్. తన సినీ ప్రయాణం గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆమె పైవిధంగా స్పందించారు. ప్రస్తుతం ఆమె నాని తదుపరి చిత్రం 'నాని 30'లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరిలో పూజా కార్యక్రమాలు జరుపుకొంది. ఈ సందర్భంగా ఈ ప్రాజెక్టు కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని తెలిపారు. 'నానితో చేసే సినిమా స్క్రిప్ట్‌ను నేను చదివాను. అది చాలా అద్భుతమైన కథతో రూపొందింది. ఇటువంటి చిత్రబృందంతో పనిచేస్తున్నందుకు నాకు చాలా గర్వంగా ఉంది' అంటూ చిత్రవిశేషాలు ముచ్చటించారు.



'విరూపాక్ష' షూటింగ్ పూర్తి


సాయి ధరమ్ తేజ్ హీరోగా, సంయుక్త మీనన్ హీరోయిన్‌గా డైరెక్టర్ కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'విరూపాక్ష' చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని హీరో సాయి ధరమ్ తేజ్ సోషల్ మీడియాలో వెల్లడించారు. ఒక్క సాంగ్ మినహా, మిగతా షూటింగ్ పూర్తయినట్లు తెలిపారు. ఇంకా ఆశ్చర్య పరిచే విజన్, నిరంతరం హార్డ్ వర్క్, టీమ్ ఫుల్ ఎఫర్ట్స్ ఈ సినిమాను మెమరబుల్‌గా, అద్భుతమైనదిగా మార్చినట్లు అన్నారు. ఈ సందర్భంగా చిత్రం కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ థాంక్స్ చెప్పారు. ఏప్రిల్ 21న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతుంది. శ్రీ వేంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్‌లపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్ నాథ్ సంగీతం అందించారు.

'మల్లికా...' వీడియో సాంగ్



సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వం వహించిన సినిమా ఏప్రిల్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. దాంతో వరుస ప్రమోషన్స్ జోరు పెంచారు మేకర్స్. ఇప్పుడు ఈ చిత్రంలో 'మల్లికా.. మల్లికా' అనే వీడియో పాటను విడుదల చేశారు. నిమిషంన్నర నిడివి ఉన్న ఈ పాటకు మణిశర్మ స్వరపరచగా, రమ్య బెహ్రా ఆలపించింది. దుష్యంతుడి కోసం ఎదురుచూస్తూ శకుంతల పాడుకునే పాటగా దీన్ని చిత్రీకరించారు.

'కిసీ కా భాయ్ కిసీ కా జాన్'లో బతుకమ్మ పాట



బాలీవుడ్ నటుడు సల్మాన్ తీస్తున్న చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' ఒకటి. ఈద్ సందర్భంగా ఏప్రిల్ 4న ఈ మూవీ రిలీజ్ కానుంది. వెంకటేష్ కీలకపాత్ర పోషించ నుండటంతో తెలుగులోనూ విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. చిత్రబృందం ఈ సినిమా నుంచి బతుకమ్మ సాంగ్‌ను రిలీజ్ చేసింది. బతుకమ్మ పండుగ ఉట్టిపడేట్టు భూమిక, పూజా హెగ్డే దాండియా స్టెప్స్ వేశారు. పాట చివర్లో సల్మాన్ కనిపించారు. ఫర్హాద్ సమ్‌జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా తమిళంలో సూపర్ హిట్టయిన 'వీరమ్'కు రీమేక్‌గా తెరకెక్కుతుంది. తెలుగులో 'వీరుడొక్కడే' పేరుతో డబ్బింగ్ అయింది. సల్మాన్ ఖాన్ తన సొంత బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. జగపతిబాబు కీలకపాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు దేవి ప్రసాద్, రవి బస్రూర్, హిమేశ్ రేషమ్మియా సంగీత దర్శులుగా వ్యవహరిస్తున్నారు.




అహ్మదాబాద్‌లోని నరేంద్రమోడీ స్టేడియంలో జరిగిన ఐపిఎల్ సీజన్-16 ప్రారంభోత్సవ వేడుకల్లో అలరించిన రష్మిక, ఆరిజిత్ సింగ్, తమన్నా

గుజరాత్ బోణి

చెన్నైపై ఐదు వికెట్ల తేడాతో గెలుపు

అహ్మదాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-16లో డిఫెండింగ్ ఛాంపియన్ గుజరాత్ జెయింట్ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో గుజరాత్ జట్టు ఐదు వికెట్ల తేడాతో చెన్నై సూపర్‌కింగ్‌పై గెలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 178పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో గుజరాత్ జెయింట్ 19.2 ఓవర్లలో కేవలం ఐదు వికెట్లు కోల్పోయి 182పరుగులు చేసి గెలిచింది. చెన్నై జట్టు తొలుత డెవాన్ కాన్వే(1) వికెట్‌ను త్వరగా కోల్పోయింది. ఆ తర్వాత రుతురాజ్ గైక్వాడ్ కేవలం 50 బంతుల్లో 4 ఫోర్లు, 9 సిక్సర్లతో 92పరుగులు చేసి సెంచరీకి దగ్గర్లో ఔటయ్యాడు. మొయిన్ అలీ(23), శివం దూబే(19) కాస్త ఫర్వాలేదనిపించినా.. బెన్ స్టోక్స్(7), జడేజా (1) అంబటి రాయుడు(12) నిరాశపరిచారు. గుజరాత్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్, రషీద్ ఖాన్, షమీకు రెండేసి వికెట్లు దక్కాయి. ఇక గుజరాత్ జట్టులో శుభ్‌మన్(63), విజయ్ శంకర్(27), సాహా(25), సుదర్శన్(22) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రషీద్ ఖాన్‌కు లభించింది.



శుభ్‌మన్(63 పరుగులు)



ఐపిఎల్‌లో నేడు..

పంజాబ్ × కోల్‌కతా
(వేదిక: మొహాలీ; సమయం: మ.3.30గంIIలకు)

లక్నో × ఢిల్లీ
(వేదిక: లక్నో, సమయం: రా.7.30గంIIలకు)

ఆకట్టుకున్న టాలీవుడ్ స్టార్స్ నృత్యాలు

అహ్మదాబాద్: నరేంద్ర మోడీ స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకల్లో టాలీవుడ్ హీరోయిన్స్ రష్మిక, తమన్నా భాటియా స్టేజ్‌పై చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వీరు ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-16 ప్రారంభోత్సవ వేడులకు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తెలుగు, తమిళ పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ముఖ్యంగా ఆస్కార్ అవార్డు అందుకున్న 'నాటు.. నాటు..' పాటకు స్టేజ్‌పై రష్మిక స్టెప్పులేయగా.. తమిళ పాటలకు నృత్యం చేసి తమన్నా అలరించింది. రష్మిక నాటు.. నాటు.. పాటతోపాటు 'పుష్ప' సినిమాలోని మూడు పాటలకు డ్యాన్స్ చేసింది. గోల్డ్ అండ్ వైట్ కలర్ డ్రస్‌లో రష్మిక, సిల్వర్ కలర్ డ్రెస్‌లో తమన్నా స్టేజ్‌పై నృత్యాలు చేశారు.

అలాగే హిందీ ప్రముఖ నేపథ్య గాయకుడు అరిజిత్ సింగ్ 'ఐ మేరే వతన్', 'లెహ్రా దో', 'వందే మాతరం' పాటలు పాడగా.. ప్రేక్షకులు అతని పాటలకు వంత పలికారు. అరిజిత్ పాడిన పాటలకు గ్యాలరీలోని ప్రేక్షకులందరూ లయ అందుకోవడం మరో విశేషం. సుమారు లక్షా 30వేల సామర్థ్యంగల నరేంద్ర మోడీ స్టేడియం అభిమానులతో పూర్తిగా నిండిపోయింది. నాలుగేళ్ల తర్వాత బిసిసిఐ మళ్లీ ప్రారంభోత్సవ వేడులను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి బిసిసిఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జే షా తదితరులు హాజరయ్యారు.



చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరు-ముంబయి జట్ల మధ్య ఆదివారం జరిగే ఐపిఎల్ మ్యాచ్ టికెట్లు దక్కించుకొనేందుకు ఎగబడుతున్న ప్రేక్షకులు

సెమీస్‌కు సింధు

క్వార్టర్స్‌లో ఓడిన శ్రీకాంత్

మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి పివి సింధు ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సింధు 21-14, 21-17తో డెన్మార్క్‌కు చెందిన బ్లిచ్‌ఫెల్డ్‌పై నెగ్గింది. బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్‌లో 11వ స్థానానికి పడిపోయిన సింధు.. 19వ ర్యాంకర్‌పై వరుససెట్లలో నెగ్గింది. రెండో గేమ్‌లో సింధు ఓ దశలో 12-6పాయింట్ల ఆధిక్యతలో నిలిచినా.. చివర్లో డెన్మార్క్ షట్లర్ పుంజుకొని సింధుకు గట్టిపోటీనిచ్చింది. సెమీస్‌లో సింధు.. బియాంగ్ జంగ్(అమెరికా)- యో- జియా- మిన్ (సింగపూర్) మ్యాచ్‌ల విజేతతో తలపడనుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో శ్రీకాంత్ 18-21, 15-21తో టాప్‌సీడ్ కెంటా నిషిమోటో(జపాన్) చేతిలో వరుససెట్లలో పరాజయాన్ని చవిచూసింది.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68